మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
గుంటూరు - శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:98 | పేజీలు:8+4 | వెల: రూ.5
GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

## లక్ష దాటనున్న తులం బంగారం



ట్రంప్ టారిఫ్స్ ఎఫెక్ట్

2

## శివకుమార్‌కు జాతీయ అవార్డు




2

# జేసీబీ పాలన పోయి.. పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చింది

• మంత్రి నారా లోకేశ్



**మంగళగిరి:** రాష్ట్రంలో జేసీబీ పాలన పోయి పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. గోవిందు, సీతామహాలక్ష్మి దంపతులకు తొలి శాశ్వత ఇంటి పట్టా అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే కీలక హామీ మంగళగిరి నుంచి ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. అధికారంలో లేనప్పుడే సొంత ఖర్చులతో 26 సంక్షేమ పథకాలు అందజేసినట్లు గుర్తుచేశారు. స్వచ్ఛతలో మంగళగిరి దేశంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల మంత్రివర్గం సమావేశంలో ఆమోదం పొందిన 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. అంతిమంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. రెండున్నర దశాబ్దాల కలను ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా

...మిగతా 2లో



# ముగిసిన ఏపీ మంత్రివర్గ సమావేశం.. కీలక అంశాలకు ఆమోదం

**అమరావతి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను (ఏపీడీసీ) ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఏపీడీసీ వ్యవహరించనుంది.

**క్యాబినెట్‌లో ఆమోదం పొందిన అంశాలు**

అనకాపల్లి జిల్లాలోని డీఎల్పురం వద్ద క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు ఆమోదం
త్రీ స్టార్, ఆ పైబడిన హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజుల కుదింపునకు ఆమోదం. బార్ లైసెన్స్‌ల ఫీజును రూ.25లక్షలకు కుదిస్తూ ఆమోదం
యువజన, పర్యాటక శాఖ జీవోల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం
రూ.710కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు ఆమోదం
ఏపీ మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు-2025కి ఆమోదం
నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం
జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం. జలహారతి కార్పొరేషన్ ద్వారా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పన

## మంత్రులు, ఎమ్మెల్యేలు 'పల్లె నిద్ర' చేయాలి: సీఎం దిశానిర్దేశం

**అమరావతి:** ఏపీ క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో 'పల్లె నిద్ర' చేయాలని దిశానిర్దేశం చేశారు. నెలలో నాలుగురోజులపాటు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో నాలుగో వంతు కూడా పొరుగు రాష్ట్రాల్లో అమలు కావడం లేదని చెప్పారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. మరోవైపు రుషికొండ ప్యాలెస్‌పై మంత్రులతో సీఎం చర్చించారు. జగన్ హయాంలో నిర్మించిన భవనాలను ఏం చేయాలన్నదానిపై చర్చించారు. మొదట మంత్రులంతా ఆ ప్యాలెస్ను సందర్శించాలన్నారు. ఆ తర్వాత

...మిగతా 2లో

## గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలి

కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు పురందేశ్వరి వినతి



2



వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కి

### ఏపీ హైకోర్టులో చుక్కెదురు

**అమరావతి:** వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. వైకాపా హయాంలో జరిగిన మద్యం విక్రయాలు,

...మిగతా 2లో

# రహదారి పరులు వేగవంతం చేయండి

## ఎంపీ బైరెడ్డి శబరి

**కర్నూల్, ఏప్రిల్ 3 (మనం న్యూస్):** కర్నూలు నుండి రాజధాని అమరావతికి చేరుకునేందుకు కీలకమైన కర్నూలు - దోర్నాల 131 కిలోమీటర్ల దూరం 340 ఇ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణ చేసి పనులు జరుగుతున్నాయని, శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు నుంచి ప్రకాశం జిల్లా దోర్నాల మధ్యలోనినల్లమల అరణ్యం లో ఘాట్ రోడ్డు నిర్మాణం పనులు కూడా వేగవంతం చేయాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. గురువారం ఢిల్లీలోని జాతీయ రహదారుల కేంద్ర మంత్రి కార్యాలయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి నంద్యాల జిల్లా లో నిర్మాణంలో ఉన్న, నిర్మాణం చేయాల్సిన జాతీయ రహదారుల వల్ల రైతులు, సమీప గ్రామాల ప్రజలకు ఎదుర్కొంటున్న సమస్యలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.



నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గం మండలంలో 340 ఇ కర్నూలు - దోర్నాల హైవేల కూడలిలో ఉన్న అండర్పాస్లు, క్రాసింగ్లు నిర్మించాలని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

# వివేకా హత్య కేసు.. వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు

**విజయవాడ:** మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు.

గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ''వివేకా కుమార్తె సునీతకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ప్రాణాలకు రక్షణ లేదు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం ఉంది. ఇటీవల నాకు తెలిసిన విషయాలు నన్ను ఆలోచింపజేస్తున్నాయి. అవినాష్ బెయిల్ రద్దు పిటిష్ను ప్రభుత్వ అఫిడవిట్లో పలు అంశాలు ఉన్నాయి. విచారణ అధికారులను ఆయన పిలిపించుకొని బెదిరించారని అఫిడవిట్లో ఉంది. తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాష్ సంతకాలు చేయించినట్లుగా ఉంది. అవినాష్ బెయిల్ ఉన్నందునే సునీతకు న్యాయం జరగడం లేదు. సాక్షులను బెదిరించి ఒత్తిడి తెస్తున్నా.. బెయిల్ రద్దు చేయట్లేదు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించారని తప్పుడు రిపోర్టు ఇచ్చారు. హత్య జరిగిన సమయంలో ఘటనాస్థలిలో ఉన్నది అవినాష్ రెడ్డే'' అని వైఎస్ షర్మిల అన్నారు.



## రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో భాగం: మోడీ



**బాంకాక్, ఏప్రిల్ 3:** భారత్, థాయ్‌లాండ్ల మధ్య శతాబ్దాల అనుబంధం ఉందని ప్రధాని మోదీ అన్నారు.బిమ్‌స్టెక్ సదస్సులో భాగంగా ప్రధాని మోడీ థాయ్‌లాండ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాతో భేటీ అయ్యారు. థాయ్ ప్రజల జీవితాల్లో రామాయణ ఇతిహాసంలోని గాథలు భాగమని మోడీ అన్నారు. దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందిన 7 దేశాల సమాగమం అయిన బంగాళాఖాత ప్రాంత బహుళ రంగ, సాంకేతిక, ఆర్థిక సహకార (బిమ్‌స్టెక్) సదస్సుకోసం రెండు రోజుల పాటు గురువారం మోడీ థాయ్‌లాండ్ వెళ్లారు. ప్రధానుల భేటీ అనంతరం మోడీ మాట్లాడుతూ.. ''భారత్-థాయిలాండ్ మధ్య

...మిగతా 2లో

## పవన్ కల్యాణ్‌ను కలిసిన నాగబాబు

**విజయవాడ:** నగరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్సీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు కలిశారు. విజయవాడలో వీరిద్దరూ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబు.. బుధవారం ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే.



# మా ఆస్తులు వెల్లడిస్తం

### కోర్టు వెబ్‌సైట్లో తమ ఆస్తుల వివరాలు పెట్టడానికి సుప్రీం న్యాయమూర్తుల ఏకగ్రీవ నిర్ణయం

**ఢిల్లీ,ఏప్రిల్ 3:** న్యాయమూర్తులు తమ ఆస్తులను కోర్టు వెబ్‌సైట్లో అప్లోడ్ చేసేలా సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయమూర్తుల ఆస్తులకు సంబంధించిన సర్వోన్నత న్యాయస్థానం కీలక చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు జడ్జీలు తమ ఆస్తులను బహిర్గతం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఈ ప్రతిపాదనకు న్యాయమూర్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వివాదం నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏప్రిల్ 1వ తేదీన సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమావేశమయ్యారు. అందులో తమ ఆస్తులకు సంబంధించిన వివరాలను కోర్టు వెబ్‌సైట్లో అప్లోడ్ చేసేందుకు వారంతా సుముఖత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 30 మంది

...మిగతా 2లో

చెన్నై టూ బొలీవియా వయా కైలాస..

## నిత్యానంద స్వామి భూలీలలు

• బొలీవియాలో పరారీలో ఉన్న నిత్యానంద స్వామి అనుచరుల భూదందాలు
• మరోసారి వార్తల్లోకి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస

**ఢిల్లీ, (మనం న్యూస్):** అత్యాచారాలు, పిల్లల కిడ్నాపులు వంటి కేసుల్లో చిక్కుకొని దేశం నుంచి పరారైన నిత్యానంద స్వామి బొలీవియాలో భూ ఆక్రమణలకు పాల్పడినట్లు వార్తలొస్తున్నాయి. దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో భూ ఆక్రమణకు ప్రయత్నించిన నిత్యానంద స్వామి సన్నిహితులు.. స్థానిక తెగలతో భూమి లీజుకు సంబంధించి ఒప్పందాలు

...మిగతా 2లో



## భూముల రద్దుపై రామానాయుడు స్టూడియోకు షోకాజ్ నోటీసులు

**విశాఖపట్నం:** రామానాయుడు స్టూడియోలో నివాస స్థలాల అంశంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న

...మిగతా 2లో

## ట్రంప్‌కు షాక్!

### విస్కాన్సిన్ ఎన్నికలో ఓటమి

**మాడిసన్,ఏప్రిల్ 3:** అమెరికాలో జరిగిన రెండు ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన మద్దతుదారు ఎలాన్ మస్క్‌కు గట్టి షాక్ తగిలింది. రిపబ్లికన్లు లక్షల డాలర్లు కుమ్మరించినా విస్కాన్సిన్‌లోని సుప్రీంకోర్టు సీటును డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారు గెలుచుకున్నారు. మరోవైపు తమ కంచుకోట ఫ్లోరిడాలో రెండు కాంగ్రెస్ సీట్లను అత్తెసరు మెజారిటీతో రిపబ్లికన్ పార్టీ నిలబెట్టుకుంది. విస్కాన్సిన్ సుప్రీంకోర్టు

...మిగతా 2లో

# మా ఆస్తులు వెల్లడిస్తం

(మొదటి పేజీ తరువాయి)

జడ్జీలు తమ ఆస్తులకు సంబంధించి డిక్లరేషన్లను సమర్పించారు. వీటిని త్వరలోనే సుప్రీంకోర్టు వెబ్‌సైట్లో పొందుపర్చనున్నారు. అయితే ఇదంతా స్వచ్ఛందంగా జరుగుతున్న ప్రక్రియేనని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. సుప్రీంకోర్టు జడ్జీలు ప్రమాణస్వీకారం చేయగానే తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఉంటుంది. అయితే, వాటిని బహిర్గతం చేయాలన్న తప్పనిసరి నిబంధనేదీ లేదు. సుప్రీం వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల డిక్లరేషన్ల కోసం ఇప్పటికే ఓ సెక్షన్ ఉంది. కానీ, గత కొన్నేళ్లుగా అందులో ఎలాంటి అప్డేట్స్ లేవు. తాజా నిర్ణయంతో త్వరలోనే సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు బహిర్గతం కానున్నాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. ఇది వివాదాస్పదం కావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు, ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటుచేసింది.

# నిత్యానంద స్వామి భూలీలలు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నట్లు తేలింది. ఈ విషయం బహిర్గతం కావడంతో 'కైలాస'తో సంబంధమున్న 20 మందిని అరెస్టు చేసిన అక్కడి అధికారులు వారి సొంత దేశాలకు పంపించివేశారు. మీడియా వెలువరిస్తున్న కథనాల ప్రకారం.. నిత్యానంద స్వయం ప్రకటిత దేశం కైలాసతో సంబంధమున్న కొందరు వ్యక్తులు ఇటీవల బొలీవియా దేశంలో రేగిన కార్చిచ్చును ఎదుర్కోవడంలో ప్రజలకు సాయపడ్డారు. ఈ సందర్భంగానే అక్కడి భూములను ఆక్రమించాలనే ఉద్దేశంతో వాటి లీజు కోసం స్థానిక తెగలతో ఒప్పందాలు చేసుకున్నారు. అధ్యక్షుడు లూయిస్ ఆర్స్‌తో ఫొటోలు దిగారు. వీరి హడావుడి అంతా చూసి 2లక్షల డాలర్లు చెల్లిస్తే ఓ ప్రాంతాన్ని 25 ఏండ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు స్థానిక తెగ ప్రతినిధి అంగీకరించారు. అయితే, కైలాస ప్రతినిధులు మాత్రం వెయ్యి సంవత్సరాల లీజుతో పాటు అక్కడ గగనతల వినియోగం, సహజవనరుల తవ్వకాలకు కూడా తమకు అనుమతించాలని కోరారు. దీనితో ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారి ప్రభుత్వం వద్దకు చేరింది. వెంటనే మేల్కొన్న బొలీవియా ప్రభుత్వం రంగంలోకి దిగి ఈ వ్యవహారంలో కైలాసతో సంబంధమున్న 20 మందిని అరెస్టు చేసింది. స్థానికులతో వారు చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసింది. సంబంధిత వ్యక్తులను ఆయా దేశాలకు (భారత్, చైనా, అమెరికా) పంపించింది. వీరు పర్యటకులుగా అనేకసార్లు బొలీవియాలోకి ప్రవేశించారని, ఈ క్రమంలోనే స్థానికులతో ఒప్పందాలు చేసుకున్నారని ఇమిగ్రేషన్ అధికారులు పేర్కొన్నారు. గత నవంబర్ నుంచి కొంతమంది అక్కడే ఉండిపోయారని గుర్తించామన్నారు. ఈ వ్యవహారంపై బొలీవియా విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. వివాదాస్పద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాసతో ఎటువంటి దౌత్య సంబంధాలు కొనసాగించడం లేదని స్పష్టం చేశారు.దేశం నుంచి పారిపోయిన నిత్యానంద 'కైలాస' అనే ప్రాంతంలో ఆశ్రమాన్ని స్థాపించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కైలాస అనే ప్రదేశం ఎక్కడ ఉందన్న దానిపై ఎన్నో ఊహాగానాలు వెలువడ్డాయి. ఈక్వెడార్ సమీపంలో ఓ చిన్న దీవిని కొనుగోలు చేసి, దానికి కైలాసం అని పేరు పెట్టినట్లు నిత్యానంద గతంలో పేర్కొన్నాడు. ఇటీవల ఓ కేసుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం కూడా నిత్యానంద ఈక్వెడార్లో ఉన్నట్లు హైకోర్టుకు తెలియజేసింది.



# మంత్రులు, ఎమ్మెల్యేలు 'పల్లె నిద్ర' చేయాలి: సీఎం దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

ఏం చేద్దామనే అంశంపై అభిప్రాయాలు చెప్పాలని మంత్రులకు చంద్రబాబు సూచించారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని వ్యవహారంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వైకాపా వ్యవహరిస్తోందని సీఎం మండిపడ్డారు. సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందని చెప్పారు.

''ప్రవీణ్ మృతి కేసు ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అప్రమత్తంగా లేకుంటే బాబాయ్ గొడ్డలి, కోడికత్తి తరహాలో అన్నీ మనపైనే వేస్తారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే.. లేని నిందలు వేసేందుకు కుట్ర చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులను వక్రీకరించి చెడు సందేశాలు వ్యాప్తి చేస్తున్నారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడతాం'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# జేసీబీ పాలన పోయి.. పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ఉందని వ్యాఖ్యానించారు. 1994లో కంప్యూటర్ అన్నం పెడుతుందా అని చాలా మంది ఎగతాళి చేశారని.. ఇవాళ ఐటీ రంగంలో హైదరాబాద్లో ఎంత మంది పని చేస్తున్నారో మనం చూస్తూనే ఉన్నామన్నారు.''రెడ్బుక్ కోసం పోలీసులు పనిచేస్తే తప్పేముంది? చట్టవిరుద్ధంగా పని చేసిన వారిని రెడ్బుక్లో చేర్చుతామని నాడు చెప్పా. ఇప్పుడు పోలీసులు చట్ట ప్రకారం పనిచేస్తున్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం పోయి తిరిగి అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతోంది. రెడ్బుక్ దెబ్బకి ఒకరికి గుండె పోటు వస్తే మరొకరు చెయ్యి విరగ్గొట్టుకున్నారు. వైకాపా కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కుల, మత ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టడంలో ఆ పార్టీ నేతలు ఆరితేరారు. అందుకే పాస్టర్ ప్రవీణ్ మరణం దర్యాప్తుపై ఆయన కుటుంబసభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నా, వైకాపా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని కుట్రలకు ఆ పార్టీ వెనుకాడదు. సొంత తల్లి, చెల్లికి సమాధానం చెప్పుకోలేని జగన్ ఇక ప్రజలకు ఏం చెప్తారు?'' అని లోకేశ్ ప్రశ్నించారు.

# ట్రంప్, మస్క్‌కు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

జడ్జి పదవికి కౌంటీ జడ్జీలైన సుసాన్ క్రాఫర్డ్ (డెమోక్రాట్ల మద్దతుదారు), బ్రాడ్ షీమెల్ (రిపబ్లికన్ మద్దతుదారు) పోటీ పడ్డారు. ఈ ఎన్నిక కోసం ఇద్దరు ఓటర్లకు ఒక్కో మిలియన్ చొప్పున మస్క్ ఇచ్చారు. దీంతోపాటు మొత్తంగా 21 మిలియన్ డాలర్లను ఖర్చు చేశారు. ఈ ఎన్నిక జాతీయ ఎన్నికల స్థాయిలో పోటాపోటీగా జరిగింది. అయినా మంగళవారం జరిగిన ఎన్నికల్లో డేన్ కౌంటీ జడ్జి అయిన క్రాఫర్డ్ ఘన విజయం సాధించారు. దీంతో స్వేచ్ఛా వాదులకు మరో మూడేళ్లపాటు సుప్రీంకోర్టులో మెజారిటీ ఉండనుంది. ట్రంప్ విధానాలను ఆటంకాల్లేకుండా అమలు చేసేందుకు సుప్రీంకోర్టు తమకు అనుకూలంగా ఉండేందుకు వీలుగా ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని మస్క్ తీవ్రంగా ప్రయత్నించారు. మంచినీళ్లలా డబ్బు ఖర్చు చేశారు. అయినా ఓటర్లు ఆయనకు షాకిచ్చారు. యూనియన్ల అధికారాలను రక్షించడంలో, ఆబార్షన్ హక్కులను కాపాడటంలో, ఓటరు ఐడీ కార్డుల విధానాన్ని వ్యతిరేకించడంలో జరిగే న్యాయ పోరాటాలకు సుసాన్ క్రాఫర్డ్ అండగా నిలుస్తున్నారు. గత నవంబరులో అధ్యక్ష ఎన్నికల తర్వాత జరిగిన పెద్ద ఎన్నిక కావడంతో అంతటా ఆసక్తి నెలకొంది. చివరకు ఓటర్లు.. ట్రంప్, మస్క్ మద్దతిచ్చిన షీమెల్‌ను కాకుండా ఒబామా, సొరోస్‌లాంటి వారు మద్దతిచ్చిన క్రాఫర్డ్కు పట్టం కట్టారు. ఎలాన్ మస్క్ స్వయంగా ఆదివారం విస్కాన్సిన్‌లో ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కోర్టులో స్వేచ్ఛావాదులకు 4-3 మెజారిటీ ఉంది. ప్రస్తుత గెలుపుతో అది 5-3గా మారనుంది. 2028 వరకూ మరో ఎన్నిక లేదు. అబార్షన్ హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల యూనియన్లు, ఓటింగ్ నిబంధనలు, కాంగ్రెస్ జిల్లాల విభజనను విస్కాన్సిన్ కోర్టు నిర్ణయించనుంది.

ఫ్లోరిడాలోని రెండు కాంగ్రెస్ జిల్లాల్లో రిపబ్లికన్లు అయిన జిమ్మీ పెట్రోనిస్, రాండీ ఫైన్ గెలిచారు. అయితే రిపబ్లికన్లకు కంచుకోట అయిన ఈ రాష్ట్రంలో వారు అత్తెసరు మెజారిటీతో విజయం సాధించడం ట్రంప్ ప్రభుత్వాన్ని షాక్‌కు గురి చేసింది. ఈ విజయాలతో ప్రతినిధుల సభలో రిపబ్లికన్ పార్టీకి 220-213 మెజారిటీ ఉంటుంది. అతి తక్కువ మెజారిటీలు దక్కడంతో ప్రజల సెంటిమెంటులో మార్పు వచ్చిందని భావిస్తున్నారు. ముఖ్యంగా భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించడం వ్యతిరేకతను పెంచిందని అంటున్నారు. అయితే ఇవి ట్రంప్ పనితీరుపై రెఫరెండం కాదని గవర్నర్ డీశాంటిస్ అభిప్రాయపడ్డారు.

# వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కి ఏపీ హైకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

తయారీలో అవకతవకల్లో మిథున్‌రెడ్డి ప్రమేయం ఉందంటూ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన పిటిషన్ దాఖలు చేయగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.

# గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలి

ఢిల్లీ: విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తగ్గించడానికి అక్కడికి సమీపంలోని గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలని ఏపీ భాజపా అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ''ఉత్తర-దక్షిణ భారత దేశాలను కలిపే విజయవాడ రైల్వేస్టేషన్‌లో రాజధాని అమరావతి కారణంగా భవిష్యత్తులో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. అమరావతి అవసరాలు తీర్చేందుకు గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించే అంశాన్ని పరిగణలోనకి తీసుకోవాలి'' అని ఆమె కోరారు.

# రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో భాగం: మోడీ

(మొదటి పేజీ తరువాయి)

శతాబ్దాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలతో బలమైన బంధం ఏర్పడింది. బౌద్ధమతం వ్యాప్తి మన ప్రజలను అనుసంధానించింది. అయుతయ నుంచి నలంద వరకు మేధావులు రాకపోకలు సాగించారు. రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో ఒక భాగమయ్యాయి. సంస్కృతం, పాళీ భాషల ప్రభావం నేటికీ ఇరువురి సంప్రదాయాల్లో ప్రతిబింబిస్తుంది. నా పర్యటన సందర్భంగా 18వ శతాబ్దపు రామాయణ కుడ్య చిత్రాల ఆధారంగా ఒక స్మారక స్టాంపును విడుదల చేసిన థాయ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'' అని హర్షం వ్యక్తంచేశారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ విజన్‌లో థాయ్‌ల్యాండ్‌ది కీలక పాత్ర అని మోడీ అన్నారు. తమ రెండు దేశాలు అభివృద్ధి వాదాన్ని సమర్థిస్తాయని, విస్తరణ వాదాన్ని కాదని చైనాను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన భూకంపంలో మృతి చెందిన వారికి భారత్ తరఫున సంతాపం తెలియజేశారు. ఈ సాయంత్రం ఆయన బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తోపాటు థాయ్‌ల్యాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. బ్యాంకాక్ పర్యటనలో భాగంగా మోడీ పదవ 'రామ'గా కూడా ప్రసిద్ధుడైన థాయ్ రాజు మహా వజిరలాంగ్‌కోమ్‌ను కలుస్తారు.

# శివకుమార్ కు జాతీయ అవార్డు

ఢిల్లీ, (మనం న్యూస్): నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన శివకుమార్ నేషనల్ యూత్ అవార్డును అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, యువజన సాధికారత, విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన, సామాజిక అవగాహన, సీనియర్ సిటిజన్లకు మద్దతుగా కార్యక్రమాలు చేసినందుకుగానూ శివకుమార్ ఈ జాతీయ అవార్డును పొందారు.

# భూముల రద్దుపై రామానాయుడు స్టూడియోకు షోకాజ్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా స్టూడియో నిర్మాణం, తత్సంబంధిత అవసరాల కోసం మాత్రమే కేటాయించిన 34.44 ఎకరాల భూమి వాడాల్సి ఉండగా.. అందులో 15.17 ఎకరాలను ఇళ్ల లేఅవుట్ కోసం వైకాపా హయాంలో రామానాయుడు స్టూడియో అభ్యర్థించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ భూమార్పిడిని అనుమతించొద్దని జనసేన నేత మూర్తి యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాజాగా ఈ భూముల రద్దుకు సంబంధించి రామానాయుడు స్టూడియోకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ను ఆర్పీ సిసోదియా ఆదేశించారు. తగినంత సమయం ఇచ్చి తరువాత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# కార్యకాలపాలన్నీ నిలిపేయండి

## కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు

ఢిల్లీ, (మనం న్యూస్): కంచ గచ్చిబౌలిలోని భూముల్లో తాను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు అన్ని కార్యకలాపాలు, చర్యలు నిలిపివేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇవాళ మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఈ వ్యవహారాలపై మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని, ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. మరో పక్క, 30 ఏండ్లుగా ఆ భూమి వివాదంలో ఉందని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమి అని ఆధారాలు లేవని కోర్టుకు తెలిపారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన



కార్యదర్శిని సర్వోన్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అని అడిగింది.

ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని తెలిపింది. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

# బండెన్క బండి కట్టి

## బీఆర్ఎస్ రజతోత్సవ పాటను ఆవిష్కరించిన పార్టీ అధినేత కేసీఆర్

## రజతోత్సవ సభ అదిరిపోయేలా ఏర్పాట్లు చేయాలని దిశనిర్దేశనం



హైదరాబాద్, మనం ప్రతినిధి: భారత రాష్ట్ర సమితి రజతోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో గురువారం పార్టీ అధినేత కేసీఆర్‌తో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నాడు ఎర్రవెల్లిలో జరిగింది. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ అంశంపై సమావేశంలో చర్చించారు. పలు అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండు జిల్లాల ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, జోగినపల్లి సంతోష్‌కుమార్, రాష్ట్ర నేతలు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యేలు డా. కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు (కనగర్), తోట ఆగయ్య (సిరిసిల్ల), జోగు రామన్న (ఆదిలాబాద్), బాల్క సుమన్ (మంచిర్యాల) తదితరులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

రచయిత, గాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రచించి గానం చేసిన 'బండెనక బండి కట్టి గులాబీల జెండ పట్టి ...'బీఆర్ఎస్ రజతోత్సవ పాటను పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ఎర్రవెల్లి నివాసంలో ఆవిష్కరించారు. నాటి నుండి నేటి వరకు బీఆర్ఎస్ ప్రస్థానాన్ని పేర్కొంటూ రజతోత్సవం సందర్భంగా పాటలు, కళారూపాల్ని రూపొందించాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్ రసమయికి సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్టా మధు, కల్వకుంట్ల విద్యాసాగర రావు, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు, పార్టీ జిల్లాల నాయకులు దావా వసంత, చల్మెడ లక్ష్మీ నరసింహారావు, జాన్సన్ నాయక్ , రామకృష్ణారెడ్డి, రమాదేవి, కిరణ్ కొమ్మెర, విలాస్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు .

# లక్ష దాటనున్న తులం బంగారం

ఢిల్లీ, (మనం న్యూస్): ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించారు. దీంతో బంగారం ధర మరింత పెరగనుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంటే 10 గ్రాముల బంగారం ధర త్వరలో రూ.లక్షకు చేరుకోనుందని అంచనా వేస్తునానయి. నెల క్రితం.. అంటే, మార్చి 2వ తేదీన 10 గ్రాముల బంగారం ధర రూ.85,320గా ఉంది. కానీ, ఒక నెల రోజులకు అంటే.. ఏప్రిల్ 2వ తేదీకి రూ.11,983 పెరిగి.. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ. 91, 115గా స్థిరంగా ఉంది. ఇక ప్రపంచ మార్కెట్లో బంగారం మాత్రం కొత్త రికార్డులు సృష్టించేందుకు పరుగులు పెడుతోంది. అదీకాక.. బంగారం ధరలు అల్ టైమ్ హైలో కొనసాగుతోన్నాయి. పర్ ఔన్స్ బంగారం రూ.3,148.88 డాలర్లుగా ఉంది. అంతుకు ముందు రూ.3,132.53 డాలర్ల వద్ద ఈ ధర స్థిరంగా ఉంది. ఇక ప్రపంచ మార్కెట్లో బంగారం రికార్డులను సృష్టిస్తోంది. స్పాట్ బంగారం ధర ఔన్సుకు ఆల్ టైమ్ గరిష్ట స్థాయి రూ.,148.88 డాలర్లకు చేరుకుంది. అనంతరం రూ.3,132.53 డాలర్ల వద్ద స్థిరపడింది.ఇక యూఎస్ గోల్ ఫ్యూచర్ సైతం 0.4% పెరిగి రూ. 3,164.20 డాలర్లకు చేరుకుంది.

# మంత్రివర్గ విస్తరణ ఇప్పటికైతే లేనట్టే!

- సోనియా, రాహుల్‌తో బీసీ ప్రజా ప్రతినిధుల భేటీ
- జంతర్‌మంతర్ ధర్నా వివరాలు అధిష్టానానికి తెలిపిన నేతలు
- మరింత కష్టపడాలని సోనియా దిశానిర్దేశం
- మంత్రివర్గ విస్తరణకు సమస్యలున్నాయన్న మహేశ్ గౌడ్



హైదరాబాద్, మనం బ్యూరో: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో అయ్యేలా కనిపించడం లేదు. మంత్రివర్గ విస్తరణపై తగిన సమయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. క్యాబినెట్‌లో 6 బెర్తులు ఖాళీగా ఉండగా, నలుగురితో భర్తీ చేయడానికి కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే, మంత్రిపదవులు ఆశిస్తున్న నేతల సంఖ్య ఎక్కువగా ఉండటం, సామాజికవర్గాల వారీగా, రాజకీయ సమీకరణలు కుదరకపోవడంతో ప్రస్తుతానికి విస్తరణ అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం పక్కనబెట్టినట్లు సమాచారం. 42 శాతం రిజర్వేషన్ల అంశంపై దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ధర్నాలో పాల్గొన్న నేతలు ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ను మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ జంతర్‌మంతర్ దగ్గర జరిగిన బీసీ పోరు గర్జన సభ వివరాలను వెల్లడించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఈ సందర్భంగా నేతలకు పిలుపునిచ్చిన సోనియా నేతలు మరింత కష్టపడాలనీ, సంక్షేమ పథకాలు అందరికీ అందించాలని సూచించారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారనీ, వారికి చేసే మేలు ప్రజలు మరువరని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల్లో మరింత వెలుగును తీసుకొస్తాయనీ, బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంటులో మోడీ ప్రభుత్వంపై బలంగా కొట్లాడుతామని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ బీసీ నేతలకు సూచించారు.

## మంత్రివర్గ విస్తరణకు సమస్యలున్నాయ్ : పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

సోనియా, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీసీలకు మరో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరామనీ, ఇద్దరికీ ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. బీసీలకు మేలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని అన్నారు. మంత్రివర్గ విస్తరణకు కొన్ని సమస్యలున్నాయనీ, రాజకీయ, సామాజికవర్గాల వారీగా అన్ని సమీకరణాలు కుదరాలని అభిప్రాయపడ్డారు. మంత్రివర్గ విస్తరణ అంశం ఏఐసీసీ పరిధిలో ఉందనీ తగిన సమయం చూసి అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. తమ అభిప్రాయాలను రాహుల్ గాంధీ, సోనియా గాంధీ తీసుకున్నారనీ, మంత్రివర్గంలోకి కొత్తగా ఎవరిని తీసుకోవాలనే అంశం అధిష్టానం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఒప్పించాలని బీజేపీ నేతలను మహేశ్ కుమార్ గౌడ్ కోరారు.

# కేసీఆర్‌పై కేసు కొట్టివేత

## 14 ఏండ్ల నాటి రైల్ రోకో కేసును కొట్టేస్తూ ప్రజా ప్రతినిధుల కోర్టు తీర్పు

హైదరాబాద్, మనం ప్రతినిధి: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై నమోదైన రైల్ రోకో కేసును కొట్టివేస్తూ..గురువారం నాడు హైకోర్టు తీర్పు వెలువరించింది. 2011 అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్ రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు నమోదు చేసి పలువురిని అరెస్టు చేశారు. ఈ కేసు ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉండగా, కేసీఆర్ పిలుపు మేరకు రైల్ రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు.

అయితే, రైల్ రోకో జరిగిన సమయంలో కేసీఆర్ అక్కడ లేరని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం, కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.



# వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం

**తిరుపతి(టీటీడి), ఏప్రిల్ 03, మనం న్యూస్:** తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం 9.15 గంటలకు శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తరువాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి ఇచ్చారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వ జ్ఞానమిదే. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకులు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు . రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు అశ్వవాహన సేవ వేడుకగా జరిగింది. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్స్వామి, చిన్నజీయర్స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 4వ తేదీ అనగా ఈ రోజు చక్రస్నానం**

శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా జరుగనుంది.

# వక్ఫ్ సవరణ చట్టంపై మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు

- వైసీపీ హయాంలో వక్ఫ్ భూముల్లో ఆక్రమణలు
- ముస్లింల ఆస్తుల పరిరక్షణకు, సంక్షేమానికి సీఎం చంద్రబాబు హామీ
- టిడిపి హయాంలోనే ముస్లింల అభివృద్ధి
- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు,ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం



**మదనపల్లె, ఏప్రిల్ 03,మనం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం-2024పై ముస్లిం మైనార్టీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ముస్లింల ఆస్తుల పరిరక్షణకు, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం జరిగిందని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు,ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు స్పష్టం చేశారు.గురువారం బెంగళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వక్ఫ్ సవరణ చట్టంపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వక్ఫ్ సవరణ చట్టం-2024పై కొన్ని సూచనలు,సలహాలు ఇవ్వగా వాటిని కేంద్ర ప్రభుత్వం స్వీకరించి చట్టంలో మార్పులు చేర్పులు చేసిందన్నారు.ఏపీలోనే కాకుండా దేశంలోని ఏఒక్క ముస్లింకి ఇబ్బంది లేకుండా చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అనంతరం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై మాట్లాడే నైతికహక్కు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి,వైకాపా నాయకులకు లేదని విమర్శించారు. వైకాపా పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని,ఏపీ ప్రజల శ్రేయస్సు కోసమే టిడిపి,జనసేన,బిజెపి పొత్తుగా ఏర్పడ్డాయన్నారు. వైకాపా నాయకులు అంతులేని అవినీతికి పాల్పడ్డారని,వేలాది ఎకరాలు భూములు కబ్జా చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్ప పరిపాలనదక్షుడని ముస్లిం సమాజానికి అండగా నిలిచారని కొనియాడారు. వక్ఫ్ సవరణ చట్టం-2024లో కొన్ని మార్పులు,చేర్పులు చేయుటకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సఫలీకృతులయ్యారన్నారు. మదనపల్లి వైకాపా ఇన్చార్జ్,ఆ పార్టీ నాయకులు వక్ఫ్ సవరణ చట్టం-2024లో అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది సమంజసం కాదన్నారు. వక్ఫ్ సవరణ చట్టం-2024 కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపినందుకు తనను రాజీనామా చేయమంటున్నారని,అంతకు ముందు ఆ పార్టీ నాయకులు చేసిన నిర్వాకాల గురించి తెలుసుకోవాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో వైకాపా నాయకులు ఎన్ని ఎకరాలు కబ్జాలు చేశారో తనతో వస్తే నిరూపిస్తానని,వారు చేసిన ఘనకార్యాలు ఎన్నో ఉన్నాయని వాటిని సందర్భం వచ్చినప్పుడు వివరిస్తానని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం-2024పై ముస్లిం మైనార్టీలకు ఎటువంటి అపోహలు అవసరం లేదని,ముస్లిం మైనార్టీ లోకానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఇప్పటికైనా వైకాపా నాయకులు అనవసరపు విమర్శలు మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యువనాయకుడు జునైద్ అక్బరీ,ఆర్.జె.వెంకటేష్,ఎస్.ఏ.మస్తాన్,షంషీర్,వ ుసలికుంట నాగయ్య,,మండిపల్లి మధుసూదన్ రెడ్డిపెద్దసంఖ్యలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్వీ హై స్కూల్ లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు

- టీటీడీ అదనపు ఈఓ సీ.హెచ్ వెంకయ్య చౌదరి

**తిరుమల,ఏప్రిల్ 03,మనం న్యూస్:** తిరుమల ఎస్వీ హై స్కూల్ లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు టీటీడీ అదనపు ఈఓ సీ.హెచ్ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు.శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అదనపు ఈఓ సిహెచ్.వెంకయ్య చౌదరి విద్యార్థులు మరియు అధ్యాపకులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు ఈవో మాట్లాడుతూ, చాలా కాలం తర్వాత ఇలాంటి కార్యక్రమానికి హాజరు కావడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఇది తన పాఠశాల మరియు కళాశాల రోజులను గుర్తుకు తెచ్చిందని ఆయన అన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం, వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందన్నారు. దేశానికి మంచి పౌరులను అందించడానికి చదువుతో పాటు, ఉన్నత విలువలను బోధించాలని అధ్యాపకులకు సూచించారు. శ్రీవారి పాదాల చెంత టీటీడీ పాఠశాలలో చదువుకుంటున్న మీరందరూ ఎంతో అదృష్టవంతులు అని ఆయన చెప్పారు. పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని విద్యార్థులు తమలో నైపుణ్యం వెలికి తీసే వివిధ కళల్లో, క్రీడల కొరకు వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. తరువాత అదనపు ఈఓ వివిధ పోటీ పరీక్షలు మరియు క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి జయలక్ష్మి, అకడమిక్ ఇన్చార్జ్ రంగలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# తాతయ్యగుంట గంగజాతర ఏర్పాట్లు చక్కగా చేద్దాం

- కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి,ఏప్రిల్ 03,మనం న్యూస్:** తిరుపతి తాతయ్యగుంట గంగజాతరలో భక్తులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కల్పించాల్సిన వసతులను చక్కగా చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను



ఆదేశించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరలో నగరపాలక సంస్థ చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంగజాతరకు వచ్చే భక్తులకు త్రాగునీరు అందించాలని, ఆలయ ప్రదేశాల్లో పడ్డ చెత్త ఎప్పటికప్పుడు తొలగించి, బ్లీచింగ్ చల్లి పరిశుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయనివ్వకుండా చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఆలయ పరిసర ప్రాంతాల్లోని మార్గాల్లో వీధి దీపాలు వెలిగేలా చూసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ వారితో సమన్వయం చేసుకుని ప్రథమచికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని ఫైర్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ తదితరాల ఏర్పాట్లు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిసిపి మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసిపి లు బాలాజి, మూర్తి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డ.ఈ.లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘనంగా భారతీ తీర్థ స్వామి వజ్రోత్సవ జన్మదిన వేడుకలు

- తిరుపతి ముఖ్య కార్యనిర్వహణాధికారిగా జీ ఎల్ మనోహర్ నియామకం

**తిరుపతి,ఏప్రిల్ 03 మనం న్యూస్ :** శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ స్వామి వారి 75వ జన్మదిన



సందర్భంగా వజ్రోత్సవ మహాసభలు, తిరుపతి శృంగేరి శంకర మఠంలో నిర్వహించారు. శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర శారదాంబ గుడిలో విశేష పూజా కార్యక్రమాలు అలాగే తిరుపతి రాముల వారి గుడి ఉత్తరమాడవీధిలోని శంకరమఠంలో శ్రీ ఆది శంకరాచార్యుల వారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లలిత సహస్రనామం, విష్ణు సహస్రనామం, సౌందర్య లహరి పారాయణ సుమారు 70 మంది ముత్తైదువులతో ఈ పారాయణ జరిగింది. ప్రముఖ ప్రవచనకర్త కుప్ప విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో వేద శాస్త్ర పండితుల సభలు నిర్వహించారు. కుప్ప విశ్వనాథ శాస్త్రి గురువారం ఆదిశంకరాచార్య గురు పరంపర గురించి శృంగేరి శంకరమఠ భారతి తీర్థ స్వామి, విధు శేఖర భారతి స్వామి వార్ల గురించి విశేషంగా ప్రవచనం అందించారు. శ్రీ భారతీయ తీర్థ స్వామి వారి కృపతో గంద్రకోట లక్ష్మి మనోహర్ ఈ తిరుపతి శంకర మఠం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమం మొత్తం ధర్మాధికారి రాళ్ళపల్లి రామమూర్తి గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి శంకర మఠం మేనేజర్ నడింపల్లి కృష , పూర్ణచంద్ర , సురభి మురళి పాల్గొన్నారు.

# ఎస్వీ వైద్య కళాశాల తల్లిపాల నిధి ప్రథమ వార్షికోత్సవం

**తిరుపతి,ఏప్రిల్ 03,మనం న్యూస్:** తల్లి సృష్టికి ప్రతి సృష్టి అంటూ తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రిలో తల్లిపాల నిధి ద్వారా అమ్మతనానికి మరింత ప్రాధాన్యత ఉందని తిరుపతి స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి కుమార్ గారు అన్నారు గురువారం ఉదయం మెటర్నిటీ ఆసుపత్రులు రోటరీ తల్లిపాల నితి ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆయన పుట్టిన బిడ్డల ఆకలి తీర్చడమే కాక రోగనిరోధక శక్తిని పెంచే తల్లిపాలను అందించడానికి ముందుకు వచ్చిన తల్లులకు వందనం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివి చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో 20047 లీటర్ల తల్లిపాలను సేకరించి 3475 మంది తల్లి పాలు అవసరమైన పిల్లలకు పంపిణీ చేయడం రోటరీ క్లబ్ చేస్తున్న అత్యుత్తమ సేవ అని కొనియాడారు పల్లి పాల నిధి చైర్మన్ టెంకాయల దామోదరం కో చైర్మన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్ గారు మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు ఇవ్వగా మిగిలిన పాలను తల్లిపాల నిధి కి దానం చేసి తల్లిపాలకు నోచుకోని పిల్లలను ఆదుకోవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కిరీటి, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ బాలకృష్ణ నాయక్, డాక్టర్ ఉషా కళావతి తదితరులు పాల్గొన్నారు.




# రియల్ ఎస్టేట్ ఆలయాలతో టీటీడీని అనుబంధం చెయ్యాలనుకోవడం అన్యాయం

- ప్రభుత్వ వైఖరి మారాలని సిఐటియు డిమాండ్

**తిరుపతి,ఏప్రిల్ 03,మనం న్యూస్:** తమ వ్యాపార అవసరాల కొరకు రియల్ ఎస్టేట్ వెంచర్ల వద్ద ఆలయాలు నిర్మిస్తున్న వాటి బాధ్యత ను టీటీడీ తీసుకోవాలని భావించడం అన్యాయమని ఈ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం నాడు అమరావతిలో జరిగిన టిటిడి సమీక్ష సమావేశంలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న జి స్క్వేర్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ తాను వెంచర్లు చేపట్టిన చోట టీటీడీ ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తున్నందున దాని నిర్వహణ బాధ్యతను టీటీడీ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించడం అసమంజసమైందని, ఈ రకమైన ధోరణితో పోతే దేశంలో అనేక వివాదాలకు కేంద్రంగా టిటిడి మారుతుందని, వ్యాపార అవసరాల కోసం వ్యక్తులు చేసే ఆలయాల నిర్మాణానికి టీటీడీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని కందారపు మురళి పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మించి వాటి నిర్వహణ చేయలేక టీటీడీ చేతులెత్తేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి మరియు మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాద్ తన నియోజకవర్గంలో నిర్మించుకున్న కళ్యాణ మండపాన్ని టీటీడీ నిర్వహించలేక కేవలం నెలకు రూపాయి లీజుతో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కళ్యాణ మండపాల నిర్వహణే చేతగాని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, దేశంలో పలుచోట్ల ఆలయాలు నిర్మిస్తున్నారని వాటి నిర్వహణ కూడా ఇబ్బందికరమైందని, ఇవే కాకుండా ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలు చేపట్టే ఆలయాలను కూడా టీటీడీ బాధ్యత తీసుకోవాలనుకోవడం సమంజసం కాదని, తక్షణం ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన జరపాలని కందారపు మురళి ఈ ప్రకటనలో కోరారు.



# ఒంటిమిట్టలో "హరిద్రా ఘటనం"తో మొదలైన శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

**ఒంటిమిట్ట / తిరుపతి,ఏప్రిల్ 3(మనం న్యూస్):** కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయ ప్రాంగణంలో గురువారం హరిద్రా ఘటనం - పసుపు దంచే సాంప్రదాయ కార్యక్రమం ప్రారంభమైంది. హిందూ సనాతన ధర్మంలో, ఏదైనా శుభ కార్యక్రమం లేదా సాంప్రదాయ కార్యక్రమాలు పసుపు పొడి తయారీతో ప్రారంభమవుతుంది. ఆలయ అర్చకులు మనోజ్ స్వామి మాట్లాడుతూ, హరిద్రా ఘటనం సమయంలో తయారు చేసిన పసుపు పొడిని వార్షిక బ్రహ్మోత్సవాలలో అభిషేకం, కళ్యాణం, అక్షింతలు తయారీలోను, పలు శుభకార్యాల్లో ఉపయోగిస్తారన్నారు. వందలాది మంది మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు రామనామ స్మరణతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శుభ సందర్భంగా టీటీడీ లోని మహిళా ఉద్యోగులు సీత సమేత రామ లక్ష్మణులకు ''సారె'' సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్ బాబు, ప్రజాసంబంధాల అధికారి నీలిమ, ఎస్వీబీసీ ప్రత్యేక అధికారి పద్మావతి, అర్చకులు వీణా రాఘవాచార్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# పుల్లయ్య గారి పల్లెలో నడివీధి గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

- పులివర్తి వినీల్

**చంద్రగిరి,ఏప్రిల్ 03,మనం న్యూస్:** చంద్రగిరి మండల పరిధిలోని పుల్లయ్య గారి పల్లెలో నడివీధి గంగమ్మ అమ్మవారికి స్థానిక శాసనసభ్యులు పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పట్టు వస్త్రాలు గురువారం సమర్పించారు. ముందుగా గ్రామస్తులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పులివర్తి వినీల్ కు స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు నడివీధి గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు జాతర వేడుకలను పురస్కరించుకుని గ్రామం నడిబొడ్డున కొలువుదీరిన గంగమ్మ వారి విగ్రహాన్ని పసుపు కుంకుమలతో సుగంధభరిత పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పులివర్తి వినీల్ నడివీధి గంగమ్మను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ చంద్రగిరి మండలం పరిధిలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పులివర్తి వినీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# అశ్వవాహనంపై శ్రీరామచంద్రుడి వైభవం

**తిరుపతి,ఏప్రిల్ 03,మనం న్యూస్:** తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు. పరమాత్మను అశ్వస్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేసింది. స్వామి అశ్వ వాహనాధిరూఢుడై భక్తులకు దర్శనమిచ్చి తద్వారా తన కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాలకు దూరంగా ఉండమని నామ సంకీర్తనాద్యుపాయాలను ఆశ్రయించి తరించమని ప్రబోధిస్తున్నాడు. వాహనసేవలో తిరుమల టీటీడీ ఆలయాల పెద్దజీయర్స్వామి, చిన్నజీయర్స్వామి,డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ముని శంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# రూ. కోటి విరాళం అందించిన భక్తులకు టీటీడీ ప్రత్యేక సౌకర్యాలు

**తిరుమల,ఏప్రిల్ 03,మనం న్యూస్:** కలియుగ దైవం తిరుమల శ్రీవారికి రూ. కోటి విరాళం ఇచ్చే భక్తులకు టీటీడీ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోంది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజులలో మినహా మిగిలిన రోజులలో విరాళం ఇచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చునని టీటీడీ ప్రకటించింది. రూ. కోటి విరాళం ఇచ్చే దాతలకు మొదటి దాత జీవితకాలంలో దాతతో పాటు నలుగురికి ప్రతి ఏడాది పలు సౌకర్యాలను టిటిడి కల్పిస్తోంది.



దాతలకు అందిస్తున్న సౌకర్యాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి సంవత్సరంలో 3 రోజులు సుప్రభాత సేవ మరియు 3 రోజులు బ్రేక్ దర్శనం, 4 రోజుల పాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకోవచ్చు. మరియు వీటితో పాటుగా దాతలకు 10 పెద్ద లడ్డూలు, 20 చిన్న లడ్డూలు, దుప్పట - 1, రవికె - 1, మహా ప్రసాదం ప్యాకెట్లు - 10, ఒక సారి వేద ఆశీర్వచనం వంటి సౌకర్యాలను పొందవచ్చు వీటితో పాటుగా రూ. 3 వేలు రుసుం విలువ చేసే వసతి గదుల సదుపాయం సంవత్సరంలో 3 రోజులు కల్పిస్తారు. అంతేకాక జీవిత కాలంలో ఒకసారి దాతకు ఒక 5 గ్రాముల శ్రీవారి బంగారు డాలర్ మరియు ఒక 50 గ్రాముల సిల్వర్ డాలర్ ను దాతలకు టీటీడీ అధికారులు అందజేస్తారు. దాతలు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ట్రస్ట్ లకు కూడ విరాళాలు ఇవ్వవచ్చు అని తెలిపారు. అందులో కాటేజ్ డొనేషన్ స్కీం, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్టు, శ్రీవేంకటేశ్వర అన్నదాన ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయాస్ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ట్రస్ట్, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినీ స్కీమ్ (స్విమ్స్) లకు దాతలు విరాళాలు చెల్లించి సంబంధింత సౌకర్యాలను కూడ పొందవచ్చు.

## నెత్తుటి గంగా తరంగం

నేనేమి అడిగానని
అలా ఆశ్చర్యంగా చూస్తావు
నేను ఏమన్నానని
మూసిన పెదవులు పిల్ల కాలువలా సాగదీసి
లో లోపల నవ్వుకుంటావు
కూరగాయల దుకాణానికి వచ్చి
బంగారం అడిగినట్టు
మాంసం మొద్దు కాడ నిలబడి
ఉల్లి పాయలు జోకమన్నట్టు
అలా వింతగా చూస్తావెందుకు
నేను అడిగింది ఏమిటి?
అర్థమయ్యీ కానట్టు
వినబడీ వినబడనట్టు
ఇంకేదో వెతుకుతున్నావు
ముప్పయి రోజుల కాలచక్రం
గిర్రున తిరిగి ఆమె నడక ఆగిపోయింది
నెల నెలా ఎటూ కదలని
నెత్తుటి గండం కత్తిలా కోసుకు పోయింది
ఇంటి మనిషి పరాయి దానిలా
వోరకున్నది నా విశాల ప్రపంచం చిన్నబోయింది
కొండ అద్దంలో వొదిగినట్టు
అనంత ఆకాశం
అత్తిపత్తిలా ముడుచుకుపోయింది
సంతోషాల సాగరం
మంచులా గడ్డకట్టుకుపోయింది
పంచభూతాలు పంజరంలో బందీ అయినట్టు
పంచప్రాణాలు ఒక అంచుకు చేరి
పొయ్యి మీది వేడినీళ్ళ దగ్గర నుండి
ఆజ్ఞలు జారీ చేస్తున్నది
ఈ పూటకు
ఆమె రిమోట్ నొక్కుతున్న యంత్రంలా
ఉరుకూ అనంగనే
పరుగు పరుగున వచ్చి నీ గడప తొక్కినందుకు
నువ్వెందుకు ముసి ముసిగా
ఆయాసపడుతున్నావు విస్పర్ అడిగినందుకు
అద్భుతం ఏదో చూసినట్టు
విస్మయం ప్రదర్శిస్తున్నావు
అమ్మకూడని వస్తువు ఏదో అమ్ముతున్నట్టు
అడగకూడని సరుకు ఏదో అడిగినట్టు
గోరింటాకు పెట్టుకున్న
ఆషాఢం పెళ్ళికూతురులా
నువ్వెందుకు సిగ్గుల మొగ్గయితున్నావు
ఆడవాళ్ళ అవసరాలకు
ఆడవాళ్ళే ఇల్లు కదలాలా
ఆమె ఆపద అతడు మోయ కూడదా

- గజ్జెల రామకృష్ణ
8977412795

# దేశాభివృద్ధిలో సముద్రవాణిజ్యం



దేశ ఆర్థికవృద్ధిలో వాణిజ్యం అనేది కీలకపాత్ర పోషిస్తుంది. దీనికి సముద్రయానం ద్వారా జరుపబడే ఎగుమతులు, దిగుమతులు ఎంతగానో తోడ్పడతాయి. దేశ వాణిజ్యానికి సముద్రరంగం వెన్నెముకగా పనిచేస్తుంది. అంతేకాక నౌకాశ్రయాలు, షిప్పింగ్ పరిశ్రమ దేశ వాణిజ్య వృద్ధికి ఊతమందిస్తున్నాయి. దేశ వాణిజ్య విలువలో 70 శాతం, పరిమాణంలో 90 శాతం సముద్రంయానం ద్వారా జరుగుతుంది. ప్రపంచంలో పదహారవ అతిపెద్ద సముద్ర దేశంగా ఇండియా ప్రపంచ షిప్పింగ్ లేన్లలో కీలక స్థానాన్ని ఆక్రమించింది. తూర్పు ఆసియా, అమెరికా, యూరప్, ఆఫ్రికా వంటి గమ్యస్థానాల మధ్య ప్రయాణించే చాలా కార్గో షిప్లు మన దేశీయ జలాలను దాటుతాయి. ఇది దేశ వ్యూహాత్మక ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. సుమారు 7516.60 కి.మీ కంటే ఎక్కువ పొడవైన తీరప్రాంతాన్ని కలిగి ఉండే మన దేశంలో పెద్ద ఓడరేవులు పన్నెండు, చిన్న ఓడరేవులు రెండు వందలు కంటే ఎక్కువ ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ 2023 ప్రకారం ఇండియా అంతర్జాతీయ షిప్మెంట్స్ విభాగంలో గ్లోబల్ ర్యాంకింగ్లో 139 దేశాలలో 22వ స్థానాన్ని, లాజిస్టిక్స్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ స్కోర్లో 38 వ స్థానంలో ఉంది. 2030 నాటికి ఈ విభాగంలో టాప్ 25 దేశాలలో ఒకటిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023 ఆర్థిక సంవత్సరంలో సరుకుల ఎగుమతులు 447.46 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయ ఓడరేవులు 819.22 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించాయి. ఇది ముందటేడాది కంటే 4.45 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఈ వృద్ధి వస్తువుల ఎగుమతుల పెరుగుదలతో సమానంగా ఉంది. ఓడరేవు, నౌకాశ్రయ ప్రాజెక్టులకు ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించడం, ఓడరేవు అభివృద్ధిలో నిమగ్నమైన సంస్థలకు పది సంవత్సరాల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వంటి విధానాలు ఈ రంగాన్ని బలోపేతం చేశాయి. ఈ చర్యలు దేశంలో విస్తరిస్తున్న వాణిజ్య నెట్వర్క్లతో కలిపి దేశ సముద్ర పరిశ్రమను దాని ఆర్థిక ఆశయాలకు మూలస్తంభంగా ఉంచాయి. 2023-24లో ప్రధాన భారతీయ ఓడరేవులు కంటైనర్ టర్నరౌండ్ సమయాన్ని 22.57 గంటలకు తగ్గించి ప్రపంచ ప్రమాణాలను అధిగమించాయి. టర్నరౌండ్ సమయం అనేది ఒక నౌక ఒక ఓడరేవు వద్ద గడిపే వ్యవధిని సూచిస్తుంది. ఇది నౌక రాక నుండి తిరిగి బయలుదేరే వరకు ఉండే కాలాన్ని తెలుపుతుంది. ఇది ఓడరేవు సామర్థ్యానికి కీలక సూచిక.

**జాతీయ సముద్రయాన దినోత్సవం:**

బ్రిటిష్ పాలనలో మన దేశం ఉన్నప్పుడే 5 ఏప్రిల్ 1919న వాల్చంద్ హీరాచంద్ సింధియా నేతృత్వంలోని సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ తయారుచేసిన యస్ యస్ లాయల్టీ అనే ఓడ సముద్ర జలాల ద్వారా అప్పటి బొంబాయి నుండి లండన్కు ప్రయాణించింది. ఇది సముద్ర కార్యకలాపాలలో విదేశీ ఆధిపత్యం నుండి బయటపడేలా చేసింది. భారతదేశ ఆధునిక సముద్ర చరిత్రకు నాంది పలికే తొలి సముద్రయానాన్ని గుర్తుచేసుకోవడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీన జాతీయ సముద్రయాన దినోత్సవాన్ని 1964 నుండి జరుపుకుంటున్నాం.

**భవిష్యత్తు లక్ష్యాలు:**

ఒక దశాబ్దంలోపు కనీసం 1,000 నౌకలతో తన నౌకాశ్రయాలను విస్తరించడానికి కొత్త షిప్పింగ్ కంపెనీని స్థాపించాలని యోచిస్తోంది. ఈ చొరవ 2047 నాటికి విదేశీ సరుకు



రవాణా ఖర్చులను మూడింట ఒక వంతు తగ్గించడం, వాణిజ్య ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. సముద్ర రంగాన్ని బలోపేతం చేయడానికి 2035 నాటికి పోర్టు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో 82 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులను నిర్దేశించింది. 2030 నాటికి 23 జలమార్గాలను ప్రారంభించాలని, 2035 నాటికి పోర్ట్ ప్రాజెక్టలో 82 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని మనదేశం యోచిస్తోంది. ఒక్కొక్కటి 300 మిలియన్ టన్నులకు పైగా కార్గో సామర్థ్యం కలిగి ఉన్న మూడు మెగా మేజర్ ఓడరేవులను నిర్మించాలని, దేశంలో రవాణా చేసే భారతీయ కార్గో స్థాయిని 25 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని లక్ష్యించింది. నియంత్రణ సంస్థ కొత్త పోర్టులను అభివృద్ధి చేయడం, షెడ్యూల్ పోర్టులను నియంత్రించడం, ఫిర్యాదులను పరిష్కరించడం, మేజర్ నాన్-మేజర్ పోర్ట్ల మధ్య వివాదాలను పరిష్కరించడం వంటి బాధ్యతలను కలిగి ఉంది. ఇంకా బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ మయన్మార్లతో కనెక్టివిటీని పెంపొందించడం ద్వారా వాటర్వేస్ కనెక్టివిటీ ట్రాన్స్పోర్ట్ గ్రిడ్ను అభివృద్ధి చేయాలని సూచించింది.

**సముద్రరంగంలో ప్రభుత్వ పథకాలు:**

సాగరమాల కార్యక్రమం: దేశం అంతటా పోర్టు ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రధాన కార్యక్రమం ఇది. దేశంలోని 7,500 కి.మీ తీరప్రాంతాన్ని, 14,500 కి.మీ నౌకాయాన జలమార్గాలను ఉపయోగించుకోవడంపై దృష్టి సారించి వివిధ పోర్టు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, తీరప్రాంత అభివృద్ధి, కనెక్టివిటీ మెరుగుదలకు ఈ పథకం మద్దతుకు ఇస్తుంది. కోస్టల్ బెర్త్లు, రోడ్డు, రైలు కనెక్టివిటీ, ఫిష్ హార్బర్లు, నైపుణ్య అభివృద్ధి, క్రూయిజ్ టెర్మినల్స్, రోపాక్స్ ఫెర్రీ సేవలు వంటి ప్రాజెక్టుల కోసం రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలకు ఆర్థిక సహాయం అందించబడుతుంది.

**అంతర్గత జలమార్గాల అభివృద్ధి:**

భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ 26 కొత్త జాతీయ జలమార్గాలను గుర్తించింది. సాధ్యాసాధ్యాల అధ్యయనాలను అనుసరించి వాటిని నౌకాయానానికి అనుకూలంగా మార్చింది. ఈ కొత్త మార్గాలు ప్రత్యామ్నాయ రవాణా విధానాన్ని అందిస్తాయి. రద్దీగా ఉండే రోడ్డు, రైలు నెట్వర్క్లపై భారాన్ని తగ్గిస్తాయి. వివిధ ప్రాంతాలకు స్థిరమైన ఖర్చుతో కూడుకున్న రవాణా ఎంపికలను ప్రోత్సహిస్తాయి.

**గ్రీన్ టగ్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్:**

దేశంలోని ప్రధాన ఓడరేవులలో సాంప్రదాయ, ఇంధన ఆధారిత హార్బర్ టగ్లను దశలవారీగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిని పరిశుభ్రమైన, స్థిరమైన ఇంధనాలతో నడిచే పర్యావరణ అనుకూల టగ్లతో భర్తీ చేస్తారు. ఈ పరివర్తన 2040 నాటికి పూర్తవుతుంది.

**మారిటైమ్ ఇండియా విజన్ 2030:**

భారతదేశాన్ని ప్రపంచ సముద్ర వాణిజ్యంలో అగ్రస్థాయిలో నిలబెట్టడానికి, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ మారిటైమ్ ఇండియా విజన్ 2030 ను ప్రారంభించింది. ఈ సమగ్ర బ్లూప్రింట్ రాబోయే దశాబ్దంలో దేశ సముద్రరంగ వృద్ధిని వేగవంతం చేయడం, సమన్వయం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. 350 కి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ వాటాదారులతో సంప్రదించి అభివృద్ధి చేయబడిన ఓడరేవులు, షిప్యార్డుల నుండి లోతట్టు జలమార్గాలు వాణిజ్య సంస్థల వరకు సముద్ర రంగంలోని అన్ని రంగాలను పరిష్కరించే పది కీలక ఇతివృత్తాలలో 150 కి పైగా చొరవలను కలిగి ఉంది.

**కఠినమైన భద్రతా సవాళ్లు:**

సముద్ర మార్గం భద్రతా సవాళ్లను కలిగి ఉంటుంది. ఆయుధాలు పేలుడు పదార్థాల స్మగ్లింగ్తో సహా ఉగ్రవాద కార్యకలాపాలకు సముద్ర మార్గం అనుకూలం కావడంతో తిరుగుబాటు గ్రూపులు సముద్రతీర ప్రాంతాలను చట్టవిరుద్ధ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవచ్చు. భారతదేశానికి సముద్ర సరిహద్దు వివాదాలు ఉన్నాయి. సర్ క్రీక్ ప్రాంతంపై పాకిస్తాన్తోను, సముద్ర సరిహద్దుపై బంగ్లాదేశ్తో దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయి. ప్రాదేశిక జలాల భద్రతను నిర్ధారించేటప్పుడు ఈ వివాదాలను నిర్వహించడం పరిష్కరించడం ఒక క్లిష్టమైన సవాలు. నివేదించబడని, నియంత్రణ లేని ఫిషింగ్ దేశ సముద్ర భద్రత ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు కలిగిస్తుంది. మన జలాల్లో అక్రమ చేపలు పట్టే కార్యకలాపాలలో నిమగ్నమైన విదేశీ నౌకలు సముద్ర వనరులను క్షీణింపజేస్తాయి. స్థానిక మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతాయి. సముద్ర అమలు సామర్థ్యాలను దెబ్బతీస్తాయి. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా నౌకాశ్రయాలు సముద్ర మౌలిక సదుపాయాలను భద్రపరచడం భారతదేశ మొత్తం భద్రతకు కీలకం. మాదకద్రవ్యాలు, ఆయుధాలు ఇతర నిషిద్ధ వస్తువులను స్మగ్లింగ్ చేయడానికి సముద్ర మార్గం అక్రమంగా ఉపయోగించబడుతోంది. మానవ అక్రమ రవాణా సముద్ర మార్గాల ద్వారా అక్రమ వలసదారుల తరలింపు అదనపు సవాళ్లను కలిగిస్తుంది. భారతదేశ కోస్ట్ గార్డ్, సముద్ర భద్రతా ఏజెన్సీలు ఈ సమస్యలు రాకుండా దేశాన్ని కాపాడుతున్నారు. నావికా రంగంలో డిజిటల్ టెక్నాలజీలపై పెరుగుతున్న ఆధారపడటం సైబర్ బెదిరింపులకు లోనయ్యేలా చేస్తుంది. సైబర్ సెక్యూరిటీ సవాళ్లలో కీలకమైనవి కమ్యూనికేషన్ నెట్వర్కు. ఇవి దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం సముద్ర భద్రతలో కీలకమైన అంశం. చమురు చిందటం అక్రమంగా డంపింగ్ చేయడం ఇతర పర్యావరణ నేరాలు సముద్ర పర్యావరణ వ్యవస్థలకు ఇబ్బంది కలిగించే అంశాలు. వీటిని ఎదుర్కోవడానికి సమర్థవంతమైన నిఘా, ప్రతిస్పందన సామర్థ్యాలు అవసరం.

- జనక మోహన రావు దుంగ
8247045230

# డీలిమిటేషన్తో అణగారిన వర్గాలకు అన్యాయం



2002లో నాడు వాజ్‌పేయి ప్రభుత్వం చివరి సారిగా పొడిగించిన డీలిమిటేషన్ ప్రక్రియ మళ్ళీ 2026లో పూర్తికానుంది. అయితే 2026 లోనే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎం.కే.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ మళ్లీ రెండోసారి గెలవడం కోసం డీలిమిటేషన్ ప్రక్రియపై తీవ్ర చర్చ బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన లేవనెత్తినప్పటికీ, దక్షిణాదిలోని ఎన్డీఏ యేతర అన్ని పార్టీలు కూడా డీలిమిటేషన్ ప్రక్రియని వ్యతిరేకిస్తున్నాయి. అందుకు ప్రధాన కారణం జనాభా నియంత్రణ చేయడం దక్షిణాది రాష్ట్రాలు అమలు చేయగా, ఉత్తరాది రాష్ట్రాలు జనాభాని నియంత్రణలో విఫలమయ్యాయి. జనాభా దామాషా ప్రకారమే కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో నేడు ఉన్న 129 సీట్లు నుండి 164కి సీట్లు పెరగనున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సీట్ల సంఖ్య 684కి పెరగనున్నాయి. దీని మూలంగా దక్షిణాది రాష్ట్రాల్లో బిజెపి పార్టీకి నామమాత్రంగా సీట్లు వచ్చినా ఒక్క ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఎక్కువ సీట్లు పొంది ఎన్డీఏ మిత్ర పార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది. దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు దేశ జనాభాలో 18% ఉండి, జిడిపిలో దాదాపు 35% పాలు పంచుకుంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తిరిగి ఇవ్వడంలో సమన్యాయం పాటించడం లేదు. ఉత్తరాదిలో బిజెపి, ఎన్డీఏ మిత్ర పార్టీల పాలిత రాష్ట్రాలకి అత్యధిక నిధులు ఇస్తూ, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నదని స్పష్టం అవుతున్నది.

పునర్విభజనపై మరింత లోతుగా ఆలోచిస్తే దక్షిణాది రాష్ట్రాలకి అన్యాయం జరుగుతున్నదని ఎన్డీఏ యేతర పార్టీ నాయకులు చెప్తున్నప్పటికీ పార్టీలకతీతంగా అణగారిన వర్గాలకి మరి ముఖ్యంగా చెప్పాలంటే బీసీ సామాజిక వర్గాలకు రాజకీయ వాటా తీవ్రంగా అన్యాయం జరగనున్నది. ఎందుకంటే నియోజకవర్గాల పునర్విభజన చేసిన ఎస్సీ, ఎస్టీల దామాషా ప్రకారం షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల వారికి సీట్లు పెరుగుతాయి. కానీ రాజకీయ పరంగా రిజర్వేషన్లు లేని వెనుకబడిన తరగతులకి రిజర్వు సీట్లు ఉండవు. కాబట్టి పెరగబోయే నియోజక వర్గాల్లో పార్టీలకతీతంగా అగ్రకుల నాయకులే గెలుస్తారు కానీ బీసీ సామాజిక వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం మూలంగా బీసీల వాటాని కూడా అగ్రకులాలే అనుభవించ నున్నారు. కాబట్టి ఈ డీలిమిటేషన్ ప్రక్రియని తెలంగాణ కేంద్రంగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు ముందుగా తెలంగాణ సమాజంలో అత్యధికంగా ఉన్న బీసీ కులాలకు జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీలో రాజకీయ రిజర్వేషన్లు కేటాయించాలనే పోరాటాన్ని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం పై చేస్తూ దక్షిణాది రాష్ట్రాలకి అన్యాయం జరగకుండా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి.



తమిళనాడు రాష్ట్రంలో బీసీల నాయకత్వంలోనే రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు నడుస్తున్నాయి కనుక అక్కడ సామాజిక న్యాయం ఆదర్శవంతంగా అమల్లో ఉన్నది. తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం జనాభా దామాషా ప్రకారం లేదు అందుకు నిదర్శనమే పార్టీలకతీతంగా తెలంగాణ జనాభాలో 5% లేని రెడ్డి సామాజిక వర్గం నుండి దాదాపు 40 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉండగా తెలంగాణ సమాజంలో 50% పైగా ఉన్న బీసీ లకు 20 మంది పైబడి ఎమ్మెల్యేలు ఉండడమే. అయితే ఎస్సీ ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్స్ ఉండటం మూలంగా షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల సమస్యల పరిష్కారానికి హక్కులు సాధించుకోవడానికి ఆయా కులాల పక్షాన ప్రజా ప్రతినిధులు కొంత మేరకు ఉన్న, బీసీ లకు రాజకీయ రిజర్వేషన్ లేకపోవడం మూలంగా దాదాపు 130 కులాలు ఉన్న బీసీల్లో కొన్ని కులాలే మరి ముఖ్యంగా మున్నూరు కాపు, ముదిరాజ్, యాదవ్స్, గౌడ్స్, పద్మశాలిలు మాత్రమే రాజకీయపరంగా తమ ప్రభావాన్ని చూపగలుగుతున్నారు . తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకి పిల్లల్ని ఎక్కువ కనమని సూచన చేస్తున్నారు, అక్కడ సామాజిక న్యాయం అమల్లో పెడుతున్నారు కాబట్టి బీసీ ఎస్సీ ఎస్టీ లకు సామాజిక రాజకీయ ఆర్థిక పరంగా ఏలాంటి అన్యాయం జరగడం లేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లోని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పిల్లల్ని ఎక్కువగా కనమని చెప్తున్నాడు కానీ ఆంధ్రప్రదేశ్లో సామాజిక న్యాయం అమల్లో లేదు. తెలంగాణలో కూడా సామాజిక న్యాయం లేదన్న విషయం శాసన సభలో ఉన్న సభ్యులను చూస్తే తెలుస్తుంది. అణగారిన వర్గాలకి జరగబోయే అన్యాయాన్ని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు లేవనెత్తకపోవడమే ఆయా పార్టీలు సామాజిక న్యాయానికి కట్టుబడి లేవని చెప్పడానికి నిదర్శనం. కాబట్టి కేంద్రం ప్రభుత్వం చేపట్టబోయే డీలిమిటేషన్ ప్రక్రియని అనేక కారణాలతో వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలు ముందుగా యుద్ధ ప్రాతిపదికన భారతీయ సమాజంలో సింహభాగం ఉన్న ఓబీసీలకి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని పోరాటం చేయకుండా దక్షిణాది రాష్ట్రాలకు మాత్రమే అన్యాయం జరగనుంది అనే అంశానికి ప్రాచుర్యం కల్పిస్తే, అసలు నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలు కావు, దక్షిణాదిలో ఉన్న ఓబీసీ లు మాత్రమే రాజకీయ పరంగా అన్యాయానికి గురికానున్నారు. ఎస్సీ, ఎస్టీ సీట్లు మినహా ఎక్కువగా తెలుగు రాష్ట్రాల్లో అగ్రకుల నాయకులు మాత్రమే పార్టీలకతీతంగా గెలుస్తున్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ లేకపోవడం మూలంగా వారి వాటాని కూడా అగ్రకుల నాయకులే అనుభవిస్తున్నారు. భవిష్యత్తులో పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు పెరిగిన మళ్లీ అగ్రకుల నాయకులే పెరిగిన సీట్లలో పోటీ చేస్తారు తప్ప, రాజకీయ రిజర్వేషన్స్ లేని బీసీలు రాజకీయంగా అన్యాయానికి గురికానున్నారు. అంతేకాదు పెరిగిన ఎస్సి, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు కూడా రాజ్యాంగ బద్ధంగా సామాజిక సమానత్వం కోసం పెంచాల్సిన అవసరం ఉన్నది.

పార్లమెంట్ సీట్లు పెంచాకే మహిళలకి 33% రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్డీఏ ప్రభుత్వం చెప్పినప్పటికీ మహిళలకి కల్పించబోయే 33% రాజకీయ రిజర్వేషన్లలో అణగారిన వర్గాల మహిళలకు 90% సీట్లు రిజర్వ్ చేయాలి. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టాన్ని సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని పునః సమీక్ష చేసి మహిళల్లో కూడా అగ్రకుల, అణగారిన వర్గాల మహిళ అనే తారతమ్యాలు రాకుండా సామాజిక న్యాయం జరిగేలా మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టాన్ని సరి చేయాలి. అగ్రకుల పురుష ఆధిపత్యానికి తోడుగా అగ్రకుల మహిళ ఆధిపత్యం పెరుగుతుంది.అలా కాకుండా అణగారిన వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు రిజర్వ్ చేస్తే సామాజిక న్యాయం జరుగుతుంది. కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 33% మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టాన్ని పార్టీలకతీతంగా అణగారిన వర్గాల మహిళలకు 33% రాజకీయ సీట్లలో సింహభావం కేటాయించాలని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంపై అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు, ప్రగతిశీల సంఘాలు ఒత్తిడి చేయాల్సిన అవసరత ఉన్నది.

అంతిమంగా కుల, మతాలకతీతంగా, పార్టీలకతీతంగా ప్రతి పౌరుడికి రాజ్యాధికారంలో సంపద, సమస్త రంగాల్లో సమాన వాటా దక్కాలి. ఆ దిశగానే డీలిమిటేషన్ ప్రక్రియలో కూడా యుద్ధ ప్రాతిపదికన విప్లవాత్మక మార్పులు చేయాల్సిన బాధ్యత నేడు కేంద్ర బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై ఉన్నది. అప్పుడు మాత్రమే దేశంలో కుల, మత, వర్గ రహిత తారతమ్యాలు లేకుండా సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతికంగా పరివర్తన జరిగి సమసమాజ స్థాపన సాధ్యమవుతుందనే చారిత్రక సత్యాన్ని అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు గ్రహించాలి.

- పుల్లెంల గణేష్
9553041549

# తగ్గుతున్న మన జ్ఞానం



నేటి డిజిటల్ యుగంలో లుకింగ్ కల్చర్ పెరుగుతూ, రీడింగ్ కల్చర్ సన్నగిల్లుతోంది. చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడం అంటే తెలియని విషయాలను తెలుసుకోవడం, అజ్ఞాన చీకట్ల



నుంచి నుంచి జ్ఞాన వెలుగుల వైపు అడుగులు వేయడం. చదవడానికి ఏకాగ్రత కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. స్మార్ట్ ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకొండి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. ప్రపంచ పోకడలకు అనుగుణంగా మనం ఎదగడానికి అవసరమైనది చదువు మాత్రమే. విద్యార్థులు పాఠ్య పుస్తకాల చదువుకు తప్పనిసరిగా సమయం ఇస్తారు. వారు ఇతర పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. ఇతరులు కూడా జీవితాంతం పుస్తక పఠనాన్ని నిరంతరం కొనసాగించాలి.

**ఇతరుల అనుభవాలతో నేర్చుకున్న వారు తెలివైన విజ్ఞానవంతులు!**

స్వానుభవంతో నేర్చుకున్న వారు మూర్ఖులు, ఇతరుల అనుభవాలతో నేర్చుకున్న వారు విజ్ఞానవంతులు అనే నినాదం విన్నాం. నేను పుస్తకాలు కొన్న తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను అనే విధంగా పుస్తకాలు కొనడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది. తెలివితో సరైన ఉద్యోగం దొరుకుతుంది. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. స్థిరత్వంతో సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను ఇస్తుందని తెలుసుకోవాలి. పుస్తకాలు కొని చదవకపోతేనే మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది. ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒక గంటైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏట వంద లేదా ఆ పైన పుస్తకాలు చదువే విధంగా మన జీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

**చదవడానికి సందర్భం అవసరం ఉందా!**

మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసినట్లయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు. మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు. వారానికి 6 నుంచి 8 గంటలు చదివే అలవాటు ఉన్న వారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్న పుస్త పఠనానికి సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది.

**ఏ రకమైన పుస్తకాలు చదవాలి!**

అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గూర్చి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదా వృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి కళ. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువరాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ పెట్టి గుర్తుంచుకోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి.

చదవడానికి నియమ నిబంధనలు, సరైన సమయం సందర్భం అనేవి ఉండవు. పాఠకుడికి ఆసక్తి ఉంటే ఎడారిలో లేదా ఎండల్లో కూడా చదవవచ్చు. చదవడం వల్ల మనో విస్తృతి పెరుగుతుంది. సమాజం అర్థం అవుతుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ప్రజాదరణ పెరుగుతుంది. పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. చదివి అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెడితే మీ వ్యక్తిత్వం మరింత ఇనుమడిస్తుంది. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం కూడా అని గుర్తుంచుకోవాలి. చదువును దుకాణంలో కొనడాని వీలు కాదు కాని పుస్తకాన్ని కొని జ్ఞానాన్ని ఆర్జించవచ్చుని మరిచి పోరాదు.

- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## కొత్త ఆశలు... ఆకాంక్షలు

సరికొత్త ఆశయాలు
సుస్థిర విశ్వాసాలు
ఉప్పొంగే ఉత్సాహంతో
విశ్వావసు నామ ఉగాది
నూతన వత్సరంలో
వేసే ప్రతి అడుగు
ప్రగతి పథం కావాలి
పురోగతికి బాట కావాలి
వృద్ధికి అభివృద్ధికి
పునాది కావాలి
అంకితభావం సంకల్పశక్తి
అవగాహన చైతన్యం
విజయాల సాధనకు
ఆయుధం కావాలి
నైపుణ్యం సృజన
మేళవింపుతో దేశ
సంపదను సౌభాగ్యాన్ని
పెంచాలి
సామాజిక ఆర్థిక సమతా
సాంఘీక ఆర్థిక పంపిణీ
సమ న్యాయం సిద్ధించాలి
పేదరికం నిరుద్యోగం
ఆర్థిక దోపిడి
లింగ వివక్ష
సమాన హక్కులు
సమాన వేతనాలు
బాలకార్మిక వ్యవస్థ
వుమెన్ ట్రాఫికింగ్
అవినీతి నేర
రాజకీయాలు
అంతరించాలి
అభివృద్ధి ఫలాలు
సామాన్యునికి చేరువ
కావాలి
మహిళా యువత
సాధికారిత సాధన
సమాజ అభివృద్ధిలో
ప్రభుత్వం పౌర సమాజ
భాగస్వామ్యం పెరగాలి
సుపరిపాలన జవాబుదారీ
పాలనకు పెద్దపీట వేయాలి
అభివృద్ధి రాజకీయాలు
అవతరించాలి
ఆత్మీయత
అనురాగాల
మేళవింపుతో
అనుబంధాలు
వికసించాలి
మమత
మానవీయత
కేంద్రంగా కుటుంబ
వ్యవస్థ బలపడాలి
మనోధైర్యంతో
ముందడుగు వేసే
మనో వైఖరి
ఉద్దీపనతో
మానవ వనరుల
వికాసం సిద్ధించాలి
సహనం సాహసం
సమత మమత
మానవీయత
సమన్వయం
సంఘీభావం
అవగాహన
సాధనాలుగా
నిత్య సంతోషం
సంతృప్తి సమాజ
జీవన శైలి కావాలి
పర్యావరణ రక్షణ
నీటి సంరక్షణ
సహజ వనరులరక్షణ
దేశ భాషల పట్ల
స్వాభిమానం
స్వదేశీ స్వాభిమానం
జాతి కార్యాచరణ
కావాలి
సంకల్ప శక్తితో
జాతి శక్తి సామర్థ్యాలు
ఇనుమడించాలి
ఉన్నత జీవన
ప్రమాణాలతో
మెరుగైన సమాజం
నిర్మాణంతో విశ్వంలో
భారత్‌ను అగ్రస్థాయికి చేర్చాలి

- నేదునూరి కనకయ్య
9440245771

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్

## వివిధ వివాహ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి



**కౌతాళం ఏప్రిల్ 3 మనం న్యూస్:** గురువారం కౌతాళం మండలం హల్వి మరియు ఉరుకుంద గ్రామలలో జరిగిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ కౌతాళం మండలం సీనియర్ నాయకులు,టీడీపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వల్లూరు అడివప్ప గౌడ్ వారికి పెళ్లి పెద్దలు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్‌ల ఆకస్మిక తనిఖీ

**కోరుట్ల, ఏప్రిల్ 3 (మనం న్యూస్):** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యానేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా కోరుట్ల లోని స్కానింగ్ సెంటర్లను, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్, డాక్టర్ల అర్హత ధ్రువీకరణపత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఐలాపూర్ లలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగాఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి. అను ఫ్లెక్సీ బోర్డుల, ఫోం బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా, మూడు నెలల జైలు శిక్ష , వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని తెలిపారు.

# మహిళలకు రక్షణ లేకుండా పోతుంది

- ఏపీ మహిళా సమాఖ్య

**కర్నూలు ఏప్రిల్ 03మనం న్యూస్:** దేశంలో , రాష్ట్రంలో మహిళలకి రోజురోజుకి రక్షణ లేకుండా పోతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ భారతీ లు పేర్కొన్నారు. గురువారం నాడు స్థానిక సీఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో శ్రావణి, నాగేంద్రమ్మ భారతి మాట్లాడుతూ అర్ధరాత్రి మహిళలు నడిరోడ్డుపై స్వేచ్ఛగా నడిచినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్రం అని జాతిపిత మహాత్మా గాంధీ పేర్కొంటే నేడు అర్ధరాత్రి రోడ్డుపైన నడవడం ఏమిటో కానీ పట్టపగులైన ఇంట్లో ఉన్న, బడిలో ఉన్న , గుడిలో ఉన్న మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు మూడు రోజుల కిందట నాగర్ కర్నూలు జిల్లా ఉరకొండ పేటలో దైవ దర్శనానికి వెళ్లిన ఒక వివాహిత మహిళను ఆరు మంది దుండగులు మద్యం మత్తులో విచక్షణ రహితంగా సామూహిక అత్యాచారం చేయడమే కాకుండా అనేక చిత్రహింసలకు గురిచేసిన దుండగులను




కఠినంగా శిక్షించాలని వారి డిమాండ్ చేశారు హిందూ సాంప్రదాయాలకు నిలయమైన దేవాలయాల్లోని ఇలాంటి సంఘటనలు జరుగుతా ఉంటే పోలీసులు ,నిగ వ్యవస్థ ఏం చేస్తుందని? వారు ప్రశ్నించారు ఉరవకొండ పేట నిందితులను బహిరంగంగా శిక్షించాలని, అదేవిధంగా విశాఖపట్నంలో ప్రేమోన్మాది నవీన్ అనే దుర్మార్గడు తన ప్రేమను తిరస్కరించిందని డిగ్రీ చదివే అమ్మాయి పైన విచక్షణారహితంగా దాడి చేయగా కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుందని తన కూతురిపై దాడిని ఆపడానికి వచ్చిన అమ్మాయి తల్లి మృత్యువాత పడిందని ఇలాంటి దుర్మార్గులకి ఎంతమంది అమ్మాయిలు మహిళలు బలి కావాలని వారు ప్రశ్నించారు అమ్మాయిలపై అత్యాచార సంఘటనలు జరిగినప్పుడు హడావిడి చేసే పోలీసులు ప్రభుత్వాలు నిందితులకు శిక్ష వేయడంలో సత్వర చొరవ చెప్పకపోవడంతో ఇలాంటి సంఘటనలో పున:రావతం అవుతూ మానవ మృగాల చేతిలో మహిళలు అర్ధాంతరంగా చనిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు సంఘటన జరిగినప్పుడు స్పందించడం కాకుండా ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలుగా నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు మహిళలపై అత్యాచారాలు చేసిన దాడులు చేసిన మరణశిక్ష తప్పదు అనే విధంగా చట్టాలు తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, విశాఖపట్నం సంఘటన పైన రాష్ట్ర హోంశాఖ మంత్రి స్పందించి విద్యార్థికి మెరుగైన వైద్యం అందించడమే కాకుండా నిందితుడికి ప్రాథమిక విచారణ పూర్తి అయిన వెంటనే కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు పక్షంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల రక్షణ కోసం ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## సచివాలయంలో చలివేంద్రం ప్రారంభం



**జూపాడుబంగ్లా ఏప్రిల్ 3 (మనం న్యూస్)** జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని సంత మార్కెట్ నందు గల జూపాడు బంగ్లా గ్రామ సచివాలయం నందు గ్రామ పంచాయతీ సెక్రెటరీ తిప్పన్న ,అధ్యక్షతన గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో గోపికృష్ణ, చలివేంద్రమును ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలు విపరీతంగా ఉండడం వలన ప్రజల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, బయట తిరిగేటప్పుడు సరైన సమయానికి త్రాగు నీరు లేక ఇబ్బందులు పడే అవకాశం ఉందని. ప్రయాణికులు, పనులకు వెళ్లే కూలీలకు అందుబాటులో ఉండేందుకు ఈ చలివేంద్రమును ప్రారంభించామని ఆయన తెలియజేశారు.

# పాఠశాలల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

**మంత్రాలయం, ఏప్రిల్3(మనం న్యూస్) :** అక్షరాస్యతలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వై బాలనాగి రెడ్డి అన్నారు.రాంపురంలోని స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో వై బాలనాగిరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జీవో నెంబర్ 117 రద్దుతో క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ ద్వారా ప్రాథమిక,ఉన్నత పాఠశాలల యందు విద్యార్థులకు అనుగుణంగా ఎంతమంది ఉపాధ్యాయుల అవసరం,విద్యార్థులకు మౌళిక సదుపాయాల కల్పన వంటి వివిధ అంశాలపై విద్యాశాఖ అధికారులు సమర్పించిన నివేదికలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా



తల్లిదండ్రులు వలసలకు వెళ్ళితే, చదువుకొనే విద్యార్థి, విద్యార్థులను వలసబాట పట్టకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మంత్రాలయం,కోసిగి, కౌతాళం,పెద్దకడుబూరు మండలాల ఎంఈఓలు రాఘున్న, రామాంజనేయులు, శోభారాణి,సువర్ణ సునీయం, రామ్మూర్తి, మంత్రాలయం మండల కన్వీనర్ బీమారెడి ,పిఏ వెంకట్రామిరెడి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పార్టీ కోసం కృషి చేయాలి

**ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**

**కౌతాళం, ఏప్రిల్ 03 మనం న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి,మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికు సేవ చేయడం నా అదృష్టమని మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎం. సుధాకర్ రెడ్డి గురువారం తెలిపారు. అనంతరం వైసిపి మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూమంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ప్రజా సమస్యలు ఏమున్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఈ రోజు నా మీద ఎంతో నమ్మకం పెట్టి మండల ఉపాధ్యక్షులు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆ నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయమని ఈ సందర్భంగా అన్నారు. నిరంతరం ప్రజలకు, వైసిపి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి సహకారంతో నా వంతుగా కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వైసిపి మండల ఉపాధ్యక్షులు ఆర్.ఎం.సుధాకర్ రెడ్డి సన్మానం చేశారు.



## గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**కర్నూలు, ఏప్రిల్ 3 (మనం న్యూస్):** కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్.పి సింగ్ బఘేల్ ను కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు... ఢిల్లీలోని బఘేల్ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మరియు సభ్యులు తో కలిసి ఆయనను కలిసిన ఎం.పి , శాలువతో సన్మానించి, భక్త కనకదాసు చిత్ర పటాన్ని అందజేశారు.. అనంతరం ఉమ్మడి కర్నూలు జిల్లాలో గొర్రెల కాపరులు ఎదురుకొంటున్న సమస్యల పై చర్చించి వినతిపత్రం అందజేశారు... ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ మరియు జిల్లా కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కేపీఎస్ వార్షిక క్రీడోత్సవం

**కోరుట్ల, ఏప్రిల్ 3(మనంన్యూస్):** వార్షిక క్రీడోత్సవాన్ని కోరుట్ల లోని పోతని భూమయ్య ఫంక్షన్ హాల్ యందు విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ క్రీడలు క్రీడాపోటీల్లో తమ ప్రతిభ కనబరిచినందుకు మెడల్స్, సర్టిఫికేట్లు, బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కేపీఎస్ కరస్పాండెంట్ గుజ్జెటి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచటమే కాకుండా, క్రమశిక్షణ, సమూహ భావన, పట్టుదల వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. 400 కి పైగా విద్యార్థులు పలు క్రీడా విభాగాల్లో అద్భుత ప్రతిభకు గుర్తింపుగా మెడల్స్, సర్టిఫికేట్లు, బహుమతులు అందుకున్నారు.

# పెండింగ్ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

- పెండింగ్ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి
- పోస్టుల భర్తీలో రిజర్వేషన్ తప్పనిసరి
- సివిల్ రైట్స్ డే ద్వారా అవగాహన కల్పించాలి
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




**హైదరాబాద్,ఏప్రిల్ 3( మనంన్యూస్):** వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని, ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా అధికారులతో ల్యాండ్, ప్రభుత్వ సేవలు, అట్రాసిటీ తదితర అంశాలపై కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని అన్నారు. అట్రాసిటీ కేసులు కోర్టులో నిలబడే విధంగా బలమైన సాక్ష్యాలను పోలీసులు సమర్పించి నిందితులకు శిక్షపడేలా చూడాలని కోరారు. కోర్టు స్థాయిలో పెండింగ్లో ఉన్న కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమీక్షించి త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. అట్రాసిటీ కేసుల్లో వైద్య ఆరోగ్య శాఖ నుండి పెండింగ్ లో ఉన్న అవసరమైన వైద్య నివేదికలు వెంటనే పంపాలని ఆదేశించారు. కులం సర్టిఫికెట్ సమర్పించని కారణంగా పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి వెంటనే సంబంధిత సర్టిఫికెట్ జారీ చేయాలని తహసిల్దార్లకు సూచించారు. రెవెన్యూ శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న భూమి సంబంధిత కేసులను ఈ నెల 30లోగా పరిష్కరించాలని ఆర్డీవోలను ఆదేశించారు. అంబేద్కర్ విద్యా నిధి పథకం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో కులాంతర వివాహ ప్రోత్సాహకాలకు కావలసిన బడ్జెట్ వివరాలు సమర్పిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీ లోను ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించినా, ఇతర కార్యక్రమాలకు మళ్లించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగాల భర్తీలో, ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని, రిజర్వేషన్ రిజిస్టర్ ను తనిఖీ చేస్తామని తెలిపారు. ప్రతి నెలా గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి గ్రామస్తులందరిని చైతన్య పరచాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశానికి జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఎజెండా తమకు పంపించాలని అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏవైనా వసతులు, సౌకర్యాలు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అవలంబించాలని, ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయాలని పోలీసు శాఖకు సూచించారు. కరీంనగర్ బాలసదనంలో పెరిగిన అనాధ ఎస్సీ యువతికి వివాహం జరిపించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని, జిల్లా సంక్షేమ అధికారి సబితను ప్రత్యేకంగా అభినందించారు. వివిధ శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ నిధుల కేటాయింపు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, ఆర్డీవోలు జిల్లా స్థాయి అధికారులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చింది నాడు ఎన్టీఆర్.. నేడు రేవంత్ రెడ్డి

- ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా కొత్త రేషన్ కార్డులు
- దశలవారీగా ఇచ్చిన హామీలన్నీ తీర్చుతాం
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**సుల్తానాబాద్ ఏప్రిల్ 3 (మనం న్యూస్):** నాడు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చినప్పుడు రూ.2కే కిలో బియ్యాన్ని ప్రవేశపెట్టి పేదల ఆకలి తీర్చాడని, ఈరోజు సీఎం రేవంత్ రెడ్డి దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని అందిస్తూ మరో చరిత్ర సృష్టించాడని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి లోని శాస్త్రి నగర్ లో గురువారం రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయం అని సన్న బియ్యం వల్ల రాష్ట్రంలో ప్రభుత్వానికి అదనంగా 3 వేల కోట్ల రూపాయల భారం పడినప్పటికీ పేదల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతతో ప్రభుత్వం బరిస్తోందన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల ఆధారంగా త్వరలోనే అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డులను అందించనున్నట్టు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, కొత్త పింఛన్లు ఇవ్వకుండా ప్రజలను దగా చేసిందని అన్నారు. సన్న వడ్ల పంటలను ప్రోత్సహించేందుకు క్వింటాలకు రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోనే పెద్దపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా సన్న వడ్లను పండిస్తున్నారని తెలిపారు. దశలవారీగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంటు, రూ. 500 కే గ్యాస్, సన్న బియ్యం పంపిణీ, రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల వంటి స్కీములను అమలు చేస్తున్నామని చెప్పారు. గర్రెపల్లి గ్రామంలో రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. శాస్త్రి నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. స్థానిక ప్రజల కోరిక మేరకు వారి కాలనీకి వెళ్లేందుకు ఉన్న రహదారి అసౌకర్యాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, తహసీల్దార్ బి రామచంద్ర రావు, ఎంపీడీవో ఎన్ దివ్యదర్శన్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ సాయిరి పద్మ, సింగిల్ విండో మాజీ చైర్మన్ జానీ, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రావు, అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలి



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 3 (మనం ప్రతినిధి):** జిల్లా పోలీస్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్లో వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో గురువారం ఎస్పీ మహేష్ బి గితే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నిందుతులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని,అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో,ఎస్సీ,ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని,ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసులను దర్యాప్తు చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై దృష్టి సారించి కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు,మధుకర్, నాగేశ్వరావు ఎస్.ఐ లు,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్, ఏప్రిల్ 3 (మనం ప్రతినిధి):** వర్ని మండలం జాకోరా, జలాల్పూర్ గ్రామాలలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం సేకరిస్తున్న ప్రక్రియను పరిశీలించి, కేంద్రం నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని సేకరించారు, ట్రక్ షీట్స్ వచ్చాయా, బిల్ టాగ్ అయ్యిందా, కొత్త గన్నీ బ్యాగులు అందాయా అని ఆరా తీశారు. గత ఏడాది ఇదే సీజన్ లో ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, ఈసారి రైతులు ఎన్ని బస్తాల ధాన్యం తరలించేందుకు అవకాశం ఉంది అని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుండి వివరాలు సేకరించారు. కొనుగోలు కేంద్రాలకు కాకుండా రైతులు ఎవరైనా ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారా? అని కలెక్టర్ ప్రశ్నించగా, అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉండడంతో కొంతమంది రైతులు ధాన్యం తడిచిపోతుందనే ఉద్దేశ్యంతో పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని, అత్యధిక మంది కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తెస్తున్నారని స్థానిక అధికారులు సమాధానం ఇచ్చారు. తేమ కొలిచే యంత్రం ద్వారా



ధాన్యం తేమ శాతాన్ని, క్యాలిపర్ సహాయంతో ధాన్యం నిర్ణీత కొలతలతో కూడి ఉన్నదా లేదా అని స్వయంగా పరిశీలించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా, సరిపడా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, అన్ని కేంద్రాలకు అవసరమైన మేర తూకం యంత్రాలను సమకూర్చాలని, గన్నీ బ్యాగుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం నిల్వలను వెంటదివెంట నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించేందుకు సకాలంలో లారీలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో నమోదు చేయాలని అన్నారు. తరుగు, కోతలు వంటి వాటికి ఆస్కారం లేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, ఏ దశలోనూ రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. కాగా, రోడ్లపై పెద్ద ఎత్తున ధాన్యం ఆరబెట్టడాన్ని గమనించిన కలెక్టర్, అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, కుప్పలుగా చేసి నిలువ ఉంచడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఖాళీ స్థలాలు, మైదాన ప్రాంతాలలో ధాన్యం ఆరబెట్టుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఒకవేళ ఖాళీ స్థలాలు అందుబాటులో లేని పక్షంలో, ధాన్యం కోతలు పూర్తయిన వరి చేలను ధాన్యం ఆరబెట్టుకునేందుకు వినియోగించుకునేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి



- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, ఏప్రిల్ 03 (మనంప్రతినిధి):** ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని గురువారం సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌస్ ను పరిశీలించారు. కన్నాపూర్ తండాలో ఇందిరమ్మ ఇండ్లకు కొబ్బరికాయ కొట్టి, ముగ్గు పోశారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులో ఎరువుల తయారీని పరిశీలించారు. అనంతరం రామారెడ్డి డంపింగ్ యార్డ్ ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిపిఓ మురళి, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, డిఆర్డిఏ పిడి సురేందర్, తహసిల్దార్ ఉమా లతా, ఎంపీడీవో తిరుపతి, ఎంఈఓ ఆనంద్ రావు, ఆర్ ఐ రవికాంత్, ఏపీఓ ధర్మారెడ్డి, వ్యవసాయ అధికారిని భాను శ్రీ, ఏపీవో ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి, ఏప్రిల్ 03 ( మనంప్రతినిధి) :** లబ్ధిదారులకు నాణ్యమైన సన్నబియాన్ని చౌక ధర దుకాణాల ద్వారా అందజేస్తున్నామని గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో చౌక ధర దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 47% సన్నబియ్యాన్ని పంపిణీ చేశామని, రామారెడ్డి లో 70% పంపిణీ పూర్తయిందని తెలిపారు. లబ్దదారులతో నేరుగా మాట్లాడామని, సన్న బియ్యం పంపిణీ పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రేషన్ షాపులో నాణ్యత, తూకంలో వ్యత్యాసం ఉంటే వెంటనే సివిల్ సప్లై అధికారులను సంప్రదించాలని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్,



డిపిఓ మురళి, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎమ్మార్వో ఉమలత, ఎంపీడీవో తిరుపతి, ఆర్ ఐ రవి కాంత్, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాలలో స్టాక్ వివరాల పట్టికను విధిగా ప్రదర్శించాలి

- **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిజామాబాద్ కలెక్టరేట్, ఏప్రిల్ 3(మనం న్యూస్):** చౌక ధరల దుకాణాలలో స్టాక్ వివరాలతో కూడిన పట్టికను విధిగా ప్రదర్శించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. గురువారం ఆయన వర్ని మండలం జలాల్పూర్ గ్రామంలోని 8 వ నెంబర్ రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. మొత్తం ఎన్ని కుటుంబాలు ఆహార భద్రతా కార్డులు కలిగి ఉన్నాయి, ఇప్పటివరకు ఎంతమందికి బియ్యం పంపిణీ పూర్తయ్యింది, ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాల గురించి రేషన్ డీలర్ కాశీరాంను ప్రశ్నించి, స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. రేషన్ షాపులోని బియ్యం నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. స్టాక్ వివరాల పట్టిక కనిపించకపోవడంతో కలెక్టర్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేద కుటుంబాల వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న నేపథ్యంలో పారదర్శకత కోసం రేషన్ దుకాణాలలో తప్పనిసరిగా స్టాక్ వివరాల పట్టికను ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా



వ్యాప్తంగా అన్ని రేషన్ షాపులలో విధిగా దీనిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న డీఎస్ఓ అరవింద్ రెడ్డిని ఆదేశించారు. ఆయా షాపులకు ఎంత పరిమాణంలో బియ్యం నిల్వలు కేటాయించబడినాయి, ఎంత మంది కార్డులు కలిగి ఉన్నారు, ఎంత మందికి బియ్యం పంపిణీ పూర్తయ్యింది, ఇంకనూ ఎంత పరిమాణంలో బియ్యం స్టాక్ మిగిలి ఉంది తదితర అన్ని వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

# వ్రక్ఫ్ బిల్లు పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి.

- **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్**

**కామారెడ్డి, ఏప్రిల్ 3 (మనంప్రతినిధి):** ఏప్రిల్ 6 బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల కార్యాచరణ కోసం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా పదాదికారుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ., దేశములోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా బీజేపీ ప్రవేశపెట్టిన వ్రక్ఫ్ బిల్లు పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయనీ, ముస్లిం లకు ఈ బిల్లు ద్వారా ఎలాంటి నష్టం జరగదని అన్నారు. అధికారంలోకి వస్తె దేశానికి మంచి చేయటమే బీజేపీ పని అని



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని ప్రతి బూత్ లో నిర్వహించాలనీ, ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జండా ఎగరవేయాలని అన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోది కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలనీ అన్నారు. బీజేపీ కార్యకర్తకి దేశం ప్రథమం, పార్టీ ద్వితీయం, ఆ తర్వాతే కుటుంబం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణా తార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్షమారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, నాయకులు సంతోష్ రెడ్డి, రవీందర్, బాల్ రాజు, శ్రీధర్, సంపత్, భూపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్,ఏప్రిల్ 3(మనం న్యూస్):** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు ఉన్నారు.



## జాతీయం- అంతర్జాతీయం

# తుర్కియేలో చిక్కుకున్న 200 మంది భారతీయులు

- **విమానం అత్యవసర ల్యాండింగ్**

అంకారా, ఏప్రిల్ 3 : ముంబయికి రావాల్సిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దాంతో కొన్ని గంటలుగా భారత ప్రయాణికులు విమానాశ్రయంలోనే ఉండిపోయారు.



లండన్ నుంచి ముంబయికి రావాల్సిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దాంతో అక్కడి మారుమూల విమానాశ్రయంలో బుధవారం రాత్రి నుంచి 200 మంది భారత ప్రయాణికులు చిక్కుకుపోయారు. మీడియా కథనాల ప్రకారం..లండన్ నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబయికి బయలుదేరింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా తుర్కియేలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అయితే ల్యాండ్ అయ్యే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తిందని ప్రయాణికులు చెప్పారు. దాంతో దాదాపు 20 గంటలుగా ప్రయాణికులు అక్కడే చిక్కుకుపోయారు. వారిలో 200 మందికిపైగా భారతీయులున్నారని మీడియా కథనాలు తెలిపాయి. అయితే తిరిగి వారు ఎప్పుడు గమ్యస్థానం చేరతారనే దానిపై స్పష్టత లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి విమానయాన సంస్థ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ప్రస్తుతం ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు ఆ విమానాశ్రయంలో లేవని ఓ ప్రయాణికుడు వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా రవాణా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. తమకు విమానాశ్రయంలో తగిన సౌకర్యాలు లేవని, అది మిలిటరీ బేస్ కావడంతో అక్కడి నుంచి బయటకు వెళ్లడానికి కూడా లేదని తెలిపారు.

# రష్యా, ఉత్తర కొరియాలపై ట్రంప్ సుంకాల్లేవ్

వాషింగ్టన్, ఏప్రిల్ 3: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల నుంచి రష్యా, ఉత్తర కొరియా, క్యూబా దేశాలకు మినహాయింపులు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించారు. అయితే, ఆయన సుంకాల ప్రకటన నుంచి పలు దేశాలకు మినహాయింపు కలిగింది. అందులో రష్యా, ఉత్తర కొరియాలు ఉన్నాయి. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10 శాతం సుంకం చెల్లించాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఈక్రమంలో పలు దేశాలకు ఆయన టారిఫ్ల నుంచి మినహాయింపు కల్పించారు. అందులో రష్యా, ఉత్తరకొరియా, క్యూబా, బెలారస్‌తో సహా పలు దేశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయా దేశాలపై పలు ఆంక్షలు ఉన్న నేపథ్యంలోనే ఈ సుంకాలు వర్తించవని వైట్‌హౌస్ పేర్కొంది. ఇక, రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ రష్యా- ఉక్రెయిన్ల యుద్ధం ముగింపునకు పట్టుబట్టారు. అందులోభాగంగా ఇటీవల రష్యా అధ్యక్షుడుతో ట్రంప్ ఫోన్లో మాట్లాడి.. ఉక్రెయిన్‌లో శాంతికి పిలుపునిచ్చారు. తన పిలుపుపై పుతిన్ నిర్లక్ష్యం చేయడం ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. దీంతో ఆ దేశంపై ఆంక్షలు, సుంకాలు విధిస్తానంటూ హెచ్చరించారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ, శాంతిపై తుది పరిష్కార ఒప్పందం చేరుకునే వరకు ఇవి కొనసాగుతాయన్నారు. కీవ్‌లో శాంతి నెలకొల్పడంపై అమెరికా ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతోంది. ఇవి



త్వరలోనే కొలిక్కి వస్తాయని ట్రంప్ ఆశిస్తున్నారు. ఉత్తరకొరియాతో తాను మంచి సంబంధాలను కోరుకుంటున్నట్లు ట్రంప్ ఇప్పటికే అనేక సార్లు పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలు ఉన్న ఇరాన్, సిరియా దేశాలు మాత్రం సుంకాల దెబ్బను ఎదుర్కోక తప్పలేదు. ఆయా దేశాలపై 10, 40 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ఆయన ప్రకటించారు. ఇక, కెనడా దిగుమతులపై అమెరికా ఇప్పటికే భారీగా సుంకాలు వసూలు చేస్తోంది. ఇటీవల వాహన దిగుమతులపై కూడా 25 శాతం టారిఫ్‌ను ట్రంప్ ప్రకటించారు. దీనిపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా స్పందించారు. ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మెక్సికో దిగుమతుల పైనా సుంకాలు అమల్లో ఉన్నాయి. ఈక్రమంలోనే ఆయన తాజా ప్రకటనలో ఈ దేశాల ప్రస్తావన లేదు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటలకు వాషింగ్టన్ డీసీలో ట్రంప్ టారిఫ్లపై ప్రకటన చేశారు.

ఈ రోజును 'లిబరేషన్ డే'గా ఆయన అభివర్ణించారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని స్పష్టంచేశారు. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఇతర దేశాలపై మాత్రం.. ఆయా దేశాలు విధిస్తున్న సుంకాల్లో సగం మేర తాము విధిస్తున్నట్లు వెల్లడించారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు తెలిపారు.

# ట్రంప్ సుంకాలు.. ఏం చేయాలనుకుంటున్నారు..?: రాహుల్ గాంధీ

- **అమెరికా సుంకాల అంశాన్ని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ లేవనెత్తారు.**

ఢిల్లీ, ఏప్రిల్ 3: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ భారత్ దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై కేంద్ర ప్రభుత్వం స్పందన తెలియజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారత్-చైనా వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'చైనా భారత్‌కు చెందిన 4 వేల కి.మీ. పైగా భూభాగాన్ని ఆక్రమించింది.

దీనిపై ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. అక్కడి రాయబారి ద్వారా ఈ విషయం బయటపడింది. దాన్ని తిరిగి తీసుకోవాలి' అని రాహుల్ పేర్కొన్నారు. ఇక, రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ గట్టిగా బదులిచ్చారు. ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. డోక్లాపై ప్రతిష్ఠంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరు తాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడం వల్ల ఏ ఫలితం ఉండదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు వారే సమాధానం చెప్పాలన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి: సోనియాగాంధీ

ఢిల్లీ, ఏప్రిల్ 3: వక్ఫ్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు- 2025పై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో సమాజంలో శాశ్వత విభజనను తీసుకురావడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని విమర్శించారు. గురువారం సంవిధాన్ సదన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పార్టీ ఎంపీలను ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి చేయడమే. దిగువ సభలో ఈ బిల్లును తొక్కేశారు. మోడీ ప్రభుత్వం విద్య, పౌర హక్కులు, స్వేచ్ఛ, సమాఖ్య నిర్మాణం, ఎన్నికల నిర్వహణ ఏదైనా దేశాన్ని అగాధంలోకి లాగుతోంది. రాజ్యాంగం అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. దాన్ని కూడా కూల్చేయాలనేదే వారి ఉద్దేశమని మాకు తెలుసు. మోడీ ప్రభుత్వ వైఫల్యాలను, వారి ఉద్దేశాలను బహిర్గతం చేయాలి. ఏది సరైనది, ఏది న్యాయబద్ధమైనది అనేది ప్రజలకు తెలియజేసేందుకు అందరం కలిసి మన పోరాటాన్ని కొనసాగించాలి అని సోనియా పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికే ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. దీన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. ఇక, పార్లమెంటులో ప్రతిపక్షాలను మాట్లాడేందుకు సమయం ఇవ్వడం లేదని సోనియా ఆరోపించారు.



కాంగ్రెస్ సభ్యులు తమ సమస్యలను లేవనెత్తనివ్వకుండా సభలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.బీజేపీ సభ్యులు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలని టార్గెట్ చేశాయన్నారు. వారి వైఫల్యాలను ఎత్తిచూపే విషయంలో పార్టీ ఎంపీలు అంతే దూకుడుగా వ్యవహరించాలని ఈసందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పార్టీ ఎంపీలందరూ హాజరయ్యారు. వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి.

# అక్రమార్కుల దర్జా...వాగులు,వంకలు కబ్జా

- డొంకలు ,రస్తలు వదలని వైనం
- హద్దులు దాటుతున్న ఆక్రమణలు

**చోద్యం చూస్తున్న అధికారగణం**



వెల్దుర్తి, ఏప్రిల్ 3మనంన్యూస్‌: మాదేఅధికారం ,మమ్మల్నిఆపేది ఎవరు అంటూ కొందరు స్థానిక అధికార పార్టీనేతల అండదండలతో కొందరు అక్రమార్కులు దర్జాగా డొంకలు ,వాగులు వంకలు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆక్రమణలో హద్దులుగాదాటుతూ ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ భూముల్లో పాగావేస్తూ కట్టడాలుచేపడుతున్నారు. ఖాళీస్థలందొరికితే కబ్జా చేసేస్తున్నారు.పోరంబోకుస్థలాలు, వంకలు, వాగులు, చెరువులనూ చివరికు ప్రభుత్వ రస్తల పైన కూడా కన్నేశారు. ఎక్కడైనా ప్రభుత్వ జాగా లేదా చెరువుల భూములు,ఖాళీ స్థలాలు కనపడ్డాయా పాగా వేసేయ్,ఇల్లుకట్టెయ్అన్నచందంగా మారింది. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రజా ప్రతినిధి లే ప్రభుత్వ అధికారులతో కలిసి ఆక్రమణలకు పాల్పడుతున్న వైనం పై మనం కథనం మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలో సుమారు 200 అడుగుల వెడల్పుతో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన వంక కాస్త వాగుగా మారే పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం వంకకు ఇరువైపులా అక్రమ కట్టడాలు వెలసడంతో వంక ఆక్రమణదారులతో కుదేలవుతుంది. వంకకు అనుకోను ఉన్న వంక స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ అక్రమ కట్టడాలు జరుగుతున్న వారికి కనిపించడం లేదా అంటు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులే అధికార పార్టీనాయకులతో ఈ అవినీతికి పాల్పడటం జరుగు తుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ కట్టడాలు అధికార పార్టీ నాయకుల అండదండలతో చేపడుతునట్లు సమాచారం. గత వైసిపిప్రభుత్వ హయంలో అప్పటి శాసన సభ్యురాలు , స్థానికనాయకుల అండదండలతో 247,248-ఆ సర్వ్ నెంబర్లు రెవిన్యు రికార్డ్ నందు రస్తా ,డొంక అని ఉన్నపటికీ యదేచ్చగా అక్రమ నిర్మాణాలు ఇప్పటికి చేపడుతున్న అధికారులు నోటిసులతో కాలయాపన చేస్తున్నారు,ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు వాగులు ,వంకలు కబ్జా చేస్తు ప్రస్తుత అధికార పార్టీ నాయకుల సహకారంతో ఇదే తంతుకొనసాగుతున్నటు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకులు కొనసాగించిన పంతానే అధికార పార్టీ స్థానిక నాయకులు కొనసాగిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్యప్రజలు సమస్యలతో కార్యాల యాలకు వస్తే చుక్కలు చూపించే అధికారులు ఈభాగోతాన్ని ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారో ప్రజలకు అర్థం కానీ పరిస్థితి ఏర్పడింది. ఒక పేదవాడు పూరి గుడిసె వేసుకుంటే అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హుటాహుటిన బందోబస్తుతో వెళ్లి దాన్ని జేసీబీతో కూలదొయందే నిద్రపోనిఅధికారులు ఇక్కడ దర్జాగా అక్రమంగానిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నరో ప్రశ్నార్థకంగా మారింది. ఇంత జరుగుతున్నా అధికా రులు మిన్నకుండిపోవడంలో వారి పాత్ర కూడా ఉండొచ్చని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంక భూముల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను గుర్తించివాటినితొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## సీత రామ లక్ష్మణుల కు వెండి కిరీటాల ను సమర్పించిన ఎమ్మెల్యే



బేతంచేర్ల, ఏప్రిల్ 3(మనంన్యూస్)‌: మండల పరిధిలో సంకలాపురం గ్రామంలోని శ్రీరామచంద్రుడు దేవాలయంలో సీత రామ లక్ష్మణుల కు కోట్ల దంపతులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ దేవతలకు కిరీటాలను సమర్పించారు ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు గ్రామ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు ప్రత్యేక పూజలు నిర్వహించి కిరీటాలను స్వామివారికి అర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు భక్తుల ఆకాంక్షలు నెరవేరేందుకు దేవతల అలంకారానికి కిరీటాలు సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు దేవాలయ అభివృద్ధి కోసం గ్రామ ప్రజలు అందరూ కలిసి దైవ కార్యక్రమాలు చేయాలి అన్నారు ప్రతి ఒక్క రిని ఆదరించే కుటుంబం కోట్ల కుటుంబం అన్నారు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కు పూలదండ దృశ్యాలులతో సన్మానించారు సుంకుల పరమేశ్వరి జంబల పరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట ప్రత్యేక పూజలు నిర్వహించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ బేతంచేర్ల మనంన్యూస్ మండలపరిదిలో మండ్ల వారి పల్లె గ్రామంలో సుంకుల పరమేశ్వరి జంబుల పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొని గ్రామంలో ప్రతిష్టించిన సుంకుల పరమేశ్వరి జంబల పరమేశ్వరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉన్నం ఎల్లనాగయ్యల్ల ప్రసన్నలక్ష్మి భీమారెడ్డి భీమేష్ రెడ్డి శ్రీనివాస్ యాదవ్ ఆకుమల్ల సుబ్బారెడ్డి గ్రామ ప్రజలు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన ఏపిఓ



మహానంది, ఏప్రిల్3,మనంన్యూస్. మహానంది మండలం ఉపాధి హామీ పథకం ఏ పి ఓ గా మల్లికార్జున పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మనోహర్ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున మహానంది మండలానికి ఉన్నతాధికారులు బదిలిచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.గురువారం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలోఎంపిడిఓ మహమ్మద్ దౌల ను కలసి బాధ్యతలు చేపట్టారు.

## ఇనాం భూములు కబ్జాకు గురికాకుండా చూడాలి

- ఏపీ ఎంఆర్ పిఎస్ జిల్లా నాయకులు నేపాల్



మంత్రాలయం , ఏప్రిల్ 3, మనం న్యూస్ :మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో సర్వే నంబర్ 62 లో ఉన్న లక్ష్మమ్మ అవ్వ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామికి సంబంధించిన భూములను కబ్జాకు గురికాకుండా చూడాలని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు గుండు పోగుల నేపాల్ మంత్రాలయం తహశీల్దార్ రవి ని కోరారు. గురువారం మంత్రాలయం తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల అధికారులు అక్రమదారుల దగ్గర ముడుపులు తీసుకోని ఫేక్ మరణ ధ్రువీకరణ పత్రాలను మరియు ఫేక్ ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్లును పెట్టి అక్రమంగా ఇనాం భూములను కబ్జా కోరుల చేతుల్లో పెడుతున్నారాన్నారు. ఇలాంటి వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇలాంటి వారిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్ పిఎస్ నాయకులు ఈమానిల్ తదితరులు పాల్గొన్నారు.

## పులకించిన పుడమితల్లి

మహానంది, ఏప్రిల్3,మనంన్యూస్‌: నంద్యాల జిల్లా మహానంది మండలం లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పుడమితల్లి పులకించింది. సంవత్సర కాలం తర్వాత మండు వేసవిలో వర్షం కురిసింది. దీనితో భూమి పులకరించింది.



## మహానందిలో ప్రముఖుల పూజలు



మహానంది, ఏప్రిల్3,మనంన్యూస్: మహానందీశ్వరుని సన్నిధిలో ప్రముఖులు పూజలు నిర్వహించారు. గురువారం సీనియర్ ఐ పి ఎస్ అధికారి జి ఎస్ రావు తెలంగాణా డిస్ట్రిక్ట్ జడ్జి పట్టాభి రామ్ దంపతులు వచ్చారు. వీరికి టెంపుల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో వేదపండితులు శాంతారామ్ బట్ వేదమంత్రోత్సరణ మధ్య కండువా కప్పి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# మళ్ళీ మొదలైన స్మశానవాటిక స్థల వివాదం



- రెవెన్యూ , పోలీసు అధికారులు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

మంత్రాలయం , ఏప్రిల్ 3, మనం న్యూస్ :- మంత్రాలయం మండల పరిధిలోని చెట్నేహళ్ళి గ్రామంలో స్మశానవాటిక స్థల వివాదం మళ్ళీ మొదలైంది. గురువారం గ్రామానికి చెందిన తలారి నాగేంద్ర భార్య లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఖననం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు తమ ఇళ్ల ముందు పూడ్చుతున్నారని తహసీల్దార్ ఎస్ రవి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు విఆర్ఓ భీమయ్య ఎస్ఐ శివాంజల్ గ్రామానికి చేరుకొని ఎస్సీ సామాజిక వర్గం వారు నిర్మించుకున్న ఇళ్లకు సుమారు నూటయాభై అడుగుల దూరంలో ఆమె మృత దేహాన్ని పూడ్చి సమస్యను తాత్కాలికంగా పూర్తి చేశారు. విఆర్ఓ నిర్వాకం వల్లే మళ్ళీ శవాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అయితే గ్రామంలో ఎవరు చనిపోయినా అధికారులు పోలీసుల సమక్షంలో ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోరంబోకు స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చి సమస్యగా మార్చారని విఆర్ఓ తప్పిదం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొందన్నారు. తహసీల్దార్ ఎస్ రవి ఎస్ఐ శివాంజల్ విఆర్ఓ భీమయ్య సాక్షిగా మృతదేహాన్ని ఖననం చేసి ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించారు. గతంలో కూడా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కూడా శ్మశాన స్థల వివాదం స్పందించి సమస్య పరిష్కారం అయ్యే వరకు యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారని ఆయన ఆదేశాలు కూడా విఆర్ఓ బేఖాతరు చేశారని ఇలాంటి అధికారుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

**పలు రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో చర్చించిన టి.జి భరత్**

కర్నూల్ ఏప్రిల్ 3 (మనం న్యూస్)‌: కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ను.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ఢిల్లీలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు నుండి ముంబైకి మరియు కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు టి.జి భరత్ తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూలు రాజధానిగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ ఈ ప్రాంతాన్ని రైల్వే పరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్లో ఎన్నో పరిశ్రమలు రానున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఓర్వకల్లు మారబోతుం దన్నారు. ఈ ప్రాంతానికి దేశంలోని ప్రధాన నగరాలతో రైలు రాకపోకలు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు టి.జి భరత్ తెలిపారు. ఈ రైల్వే సౌకర్యాలపై తప్పకుండా పరిశీలిస్తామని ఆయన చెప్పారన్నారు.



## ఎనిమిరేటర్లు,వివోఏలకు మండల స్థాయి శిక్షణ



కౌతాళం,ఏప్రిల్ 3 మనం న్యూస్ ‌: కౌతాళం స్థానిక స్త్రీ శక్తి మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు గురువారం రోజున ఏపీఎం ఫరీద్ ఖాన్ ఆధ్వర్యంలో వివోఏలకు మరియు ఏనుమారేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఎనుమరారేటర్స్ సంఘాలు యొక్క 2025,26 ఆర్థిక సంవత్సరానికి వాళ్లకి కావాల్సిన జీవనోపాదుల ప్రణాళికను పకడ్బందీగా సర్వే చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఫరీద్ ఖాన్, ఎల్సిసీ నర్సింహులు,సిసిలు బజారప్ప,ఎంకన్న అకౌంటెంట్ మంజునాథ వివోఏలు ఎనుమారేటర్ లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ముస్లిం సమాజాన్ని నమ్మించి దగా చేసిన చంద్రబాబు

- చంద్రబాబు చేసిన నమ్మకద్రోహం చరిత్రలో నిలిచిపోతుంది
- టీడీపీకి చిత్తశుద్ధి ఉంటే జేపీసీ వరకు బిల్లు వెళ్ళేదా?
- మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ అబ్దుల్ హాఫీస్ ఖాన్ ధ్వజం



కర్నూల్ ఏప్రిల్ 3(మనం న్యూస్) ముస్లింలను నమ్మించి మసీదు భూములను కాపాడుతనని నమ్మించి ఇప్పుడు మసీదు భూములను కాపాడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలం చెందారని మాజీ ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయ ఎన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో చంద్రబాబు చేసిన మోసం చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ అబ్దుల్ హాఫీస్ ఖాన్ మండిపడ్డారు. కర్నూలు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ముస్లింల పట్ల తెలుగుదేశం నమ్మకద్రోహంకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీల విషయంలో చంద్రబాబుకు ఉన్న వ్యతిరేక వైఖరి ఈ బిల్లు విషయంలో మరోసారి బయపడిందని ధ్వజమెత్తారు. వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ముస్లింల హక్కులను కాపాడటంపై చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి వెల్లడయ్యింది. దేశం మొత్తం ముస్లిం సమాజానికి ఆయన నిజస్వరూపం తెలిసిపోయింది. 9 లక్షల ఎకరాల భూమిపై వక్ఫ్ బోర్డ్ తన హక్కులను కోల్పోయే పరిస్థితికి కారణమయ్యే ఈ బిల్లును చంద్రబాబు ఎందుకు వ్యతిరేకించలేదు? ఇంత కుట్ర జరుగుతుంటే నలభై ఏళ్ళ అనుభవం ఉన్న చంద్రబాబు ఎందుకు ప్రశ్నించడం లేదు? కేంద్రం మొత్తం నితీష్, చంద్రబాబుల మద్దతుపైనే ఆధారపడి ఉంది. కీలకమైన సంఖ్యాబలం ఉన్న చంద్రబాబు ప్రారంభంలోనే ఈ బిల్లును అడ్డుకుని ఉంటే, జేపీసీ దాకా బిల్లు వెళ్ళేదా? ఒకవైపు రాష్ట్రంలో ముస్లింలకు మాయమాటలతో వక్ఫ్ సవరణలో వారికి ఎటువంటి అన్యాయం జరగదంటూ మోసపు హామీలు ఇచ్చారు. మరోవైపు కేంద్రంలో బిల్లుకు మద్దతు పలికి, ఆమోదంకు మార్గం సుగమం చేశారు. ఇదే క్రమంలో జాతీయ మీడియాలో వక్ఫ్ బిల్లును చంద్రబాబు అడ్డుకుంటున్నాడంటూ మరో అబద్ధపు ప్రచారం ఘనంగా చేయించుకున్నారు. రెండు నాలుకల దోరణితో ముస్లింలను మాయ చేయాలని చంద్రబాబు అనుకున్నారు. గోద్రా అల్లర్ల తరువాత నేను మారిన మనిషిని, మైనార్టీల పట్ల అనుకూలంగా ఉంటాను, నాకు అవకాశం ఇవ్వాలని మభ్యపెట్టారు. రాష్ట్రంలో అన్నిచోట్లా ముస్లిం సమాజం ఈ మాటలు నమ్మి చంద్రబాబుకు ఓట్లు వేశారు. కనీసం రాజ్యసభలో అయినా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లును అడ్డుకోవాలి. వైయస్ఆర్సీపీ ఈ బిల్లును ప్రజాస్వామ్య విధానాల్లో అడ్డుకుంటుంది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా వైయస్ జగన్ గారు మైనార్టీలకు జరుగుతున్న అన్యాయంను తిప్పికొట్టాలనే నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు.

**వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడం దారుణం**

బీజేపీ ఏనాడూ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించలేదు. ఎన్డీఏ పాలనలో ముస్లిం మైనార్టీలను రాజకీయంగా ప్రోత్సహించలేదు. సంఖ్యాబలం ఉందని జాయింట్ పార్లమెంటరీ కమిటీలోనూ అన్ని అభ్యంతరాలను పక్కకుపెట్టి వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించారు. ఆల్ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డ్, జమాతే ఉలేమా, జమాతే ఇస్లామిక్ హింద్, సునతుల్ జమాత్ వంటి సంస్థలు కూడా ఈ బిల్లును వ్యతికించాయి. దీనివల్ల మైనార్టీలు నష్టపోతారని ముక్తకంఠంతో చెప్పాయి. అయినా కూడా కేంద్రప్రభుత్వం ఈ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోలేదు. వక్ఫ్ బోర్డ్లో కొత్తగా మహిళలకు అవకాశం ఇవ్వడం లేదు, గతంలోనే ఇద్దరు మహిళలకు బోర్డ్లో స్థానం ఉంది. కేంద్రమంత్రి రిజీజు మాట్లాడుతూ ఆర్మీ, రైల్వేల తరువాతే ఎక్కువ భూమి వక్ఫ్ బోర్డ్ చేతుల్లోనే ఉందని మాట్లాడారు. ఇప్పుడు ఆ వక్ఫ్ బోర్డ్ భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు. దీనికి ఉమ్మీద్ అని పేరు పెట్టారు. వక్ఫ్ బై యూజర్ అంటే అయిదారు వందల సంవత్సరాల కిందట మసీద్, దర్గా, కబ్రస్తాన్ నిర్మించి ఉంటే, దానికి ఇప్పుడు డాక్యుమెంట్లు చూపించాలని అడుగుతున్నారు. లేకపోతే వాటిని మూసేస్తామని చెబుతున్నారు. దానిని తొలగించవద్దని కోరినా పట్టించుకోలేదు. వక్ఫ్ భూములపై అధికారం కలెక్టర్లకు ఇస్తామనడం మంచిది కాదు. ప్రభుత్వంలో పనిచేసే అధికారి ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే, ఆ ప్రభుత్వం చెప్పినట్లు నిర్ణయం తీసుకుంటారు. దీనివల్ల న్యాయం జరగదు. దీనినే చంద్రబాబు చాలా తెలివిగా కలెక్టర్ కు అధికారం వద్దు, ఆయన కంటే పై స్థాయిలో ఉన్న వారికి నిర్ణయాధికారం ఇవ్వాలని ప్రతిపాదించారు. ఆ పై స్థాయి అధికారి మాత్రం ప్రభుత్వం మాట వినకుండా తన సొంత నిర్ణయం తీసుకుంటారా? అన్నింటిపైనా అధికారులకే అప్పగిస్తే ఇక న్యాయస్థానాలు ఎందుకు?

**- వక్ఫ్ భూములపై హక్కులు ఉండవు**

వక్ఫ్ ఆస్తులను ఆరు నెలల లోపు సెంట్రల్ డేటా బేస్లో ఎక్కించకపోతే ఆ ఆస్థిపై హక్కు కోల్పోతారని చెబుతున్నారు. వందల సంవత్సరాల నుంచి అన్ని మతాల వారు కలిసిమెలిసి జీవిస్తున్నారు. వక్ఫ్ బోర్డ్ లోమాత్రం ఇతర మతస్థులను పెట్టి, నామినేటెడ్గా పదవులను కేటాయించాలని చూస్తున్నారు. దీనివల్ల ముస్లింలకు న్యాయం జరుగుతుందా? అన్ని సంస్థలకు ప్రత్యేకంగా ట్రిబ్యునల్స్ ఉన్నాయి. వక్ఫ్ ట్రిబ్యునల్ను బలహీనపరిచేందుకే ఈ చట్ట సవరణ తీసుకువచ్చారు. వక్ఫ్ ఆస్తి అంటే అల్లాపై విశ్వాసంతో ఎవరైనా సరే భగవంతుడికి కొంత మేర ఆస్తి సమర్పిస్తారు. కానీ తాజా సవరణతో ముస్లింగా కనీసం అయిదేళ్ళు ఉన్న వారే ఇలా దానం చేయడానికి అర్హులనే నిబంధన దారుణం. దేశంలోని అన్ని దర్గాలకు మతాలతో సంబంధం లేకుండా భక్తులు వెడుతుంటారు. వారి అనుకూలతను బట్టి ఆస్తులను భగవంతుడికి సమర్పిస్తుంటారు. దీనిని కూడా మత కోణంలో చూడటం దుర్మార్గం.






# ఆర్సీబీతో మ్యాచ్‌పై సిరాజ్ ఎమోషనల్

గత సీజన్ వరకూ ఆ జట్టుతోనే కలిసి ఆడాడు. ఈ మైదానంలోనే ప్రాక్టీస్ తో పాటు వికెట్లను తీశాడు. ఇప్పుడు ప్రత్యర్థిగా బరిలోకి దిగాడు. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఆ ప్లేయర్ మహ్మద్ సిరాజ్. ఇప్పుడు అతడు గుజరాత్ టైటాన్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా చిన్నస్వామి స్టేడియం వేదికగానే బెంగళూరు తో గుజరాత్ తలపడింది. ఈ మ్యాచ్ లో జీటీ విజయం సాధించింది. సిరాజ్ 4 ఓవర్ల కోటాలో 3 వికెట్లు తీసి సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొన్నాడు. ఈసందర్భంగా కాస్త భావోద్వేగానికి గురయ్యాడు.

''నేను ఇక్కడ ఏడేళ్లు ఆడా. నా జెర్సీ రెడ్ నుంచి బ్లూకి మారిపోయింది. ఇక్కడికి వచ్చాక కాస్త భావోద్వేగానికి గురయ్యా. కానీ, బంతి అందుకొన్నాక మాత్రం ఇవేవీ ఆలోచించను. నేను రొనాల్డో అభిమానిని. అందుకే, వికెట్ వచ్చిన సమయంలో నా సంబరాలు అలా చేసుకుంటున్నా. అంతర్జాతీయ క్రికెట్ కు విరామం వచ్చినప్పుడు నా తప్పులు ఏంటో తెలుసుకున్నా. ఫిట్ నెస్ పై వర్కౌట్ చేశా. గుజరాత్ టైటాన్స్ నన్ను తీసుకున్నప్పుడు ఆశిశ్ తో మాట్లాడా. బౌలింగ్ ను ఆస్వాదించమని సూచించాడు. ఇక సీనియర్ ఇషాంత్ శర్మ లైన్ అండ్ లెంగ్త్ గురించి చెప్పాడు. నేను పిచ్ గురించి పెద్దగా పట్టించుకోను. సానుకూల దృక్పథంతో ముందుకుసాగుతున్నా'' అని సిరాజ్ వెల్లడించాడు.



# అగ్రస్థానంలోనే హార్దిక్

ఐసీసీ టీ20 ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్ లో హార్దిక్ పాండ్య అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అక్షర్ పటేల్ 12, అభిషేక్ శర్మ 13వ స్థానాల్లో నిలిచారు. బౌలింగ్ ర్యాంకింగ్స్ లో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఒక ర్యాంకు తగ్గి మూడో స్థానంలో నిలిచాడు. రవి బిష్ణోయ్ 7, అర్ష్ దీప్ సింగ్ 10, అక్షర్ పటేల్ 13వ స్థానాల్లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ 2, తిలక్ వర్మ 4, సూర్యకుమార్ యాదవ్ 5, యశస్వి జైశ్వాల్ 13వ ర్యాంకులతో ఉన్నారు.

### తీరు మారని ఎస్ఆర్ హెచ్..

# ఓటముల్లో హ్యాట్రిక్

ఐపీఎల్-2025లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఓటుమల పరంపర కొనసాగుతోంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో 80 పరుగుల తేడాతో ఎస్ఆర్ హెచ్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్ లో బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ సన్ రైజర్స్ ప్లేయర్లు తేలిపోయారు.

ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. కోల్కతా బ్యాటర్లలో వెంకటేశ్ అయ్యర్(29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్ లతో 60) టాప్ స్కోరర్ గా నిలవగా.. రఘువంశీ(50), రింకూ సింగ్(32), రహానే(38) కీలక ఇన్నింగ్స్ లు ఆడారు. ఎస్ఆర్ హెచ్ బౌలర్లలో కమ్మిన్స్, షమీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలా వికెట్ సాధించారు.

చేతులేత్తేసిన బ్యాటర్లు..

అనంతరం 201 పరుగుల భారీ లక్ష్య చేధనలో ఎస్ఆర్ హెచ్ 16.4 ఓవర్లలో కేవలం 120 పరుగులకే కుప్పకూలింది. సన్ రైజర్స్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్(33), మెండిస్(27) పర్వాలేదన్పించగా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

స్టార్ బ్యాటర్లు అభిషేక్ శర్మ(2), హెడ్(4), ఇషాన్ కిషన్(2) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ ఆరోరా, వరుణ్ చక్రవర్తి తలా మూడు వికెట్లు సాధించగా.. రస్సెల్ రెండు, హర్షిత్



రాణా, నరైన్ ఒక్క వికెట్ సాధించారు. ఈ మెగా టోర్నీలో ఎస్ఆర్ హెచ్ కు వరుసగా మూడో ఓటమి కావడం గమనార్హం.

# నా జీవితం అతడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది..

రేడియో జాకీ మహ్‌వశ్ సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్ గా మారింది. దీనికి భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ లైక్ కొట్టడంతో ఫ్యాన్స్ తమ కామెంట్లతో హోరెత్తించారు. గత ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సమయంలో వీరిద్దరూ మైదానంలో సందడి చేసిన సంగతి తెలిసిందే. చాహల్ - మహ్‌వశ్ ప్రేమలో



ఉన్నారని అప్పటి నుంచి రూమర్లు వచ్చాయి. ఇక తన భార్య ధన్యశ్రీ నుంచి చాహల్ ఇటీవలే విడాకులు తీసుకోవడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా మహ్ వశ్ 'హస్బెండ్' వీడియో పోస్టు చేయడం గమనార్హం.

''నా జీవితంలోకి ఏ అబ్బాయి అయితే వస్తాడో.. అతనే ఏకైక వ్యక్తి అవుతాడు. అతడే నాకు స్నేహితుడు. అతనే నా ప్రియుడు. అతనే నా భర్త. నా జీవితం అతడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. నాకు అవసరం లేని వ్యక్తులు వద్దు. ఆ సమయంలో నేను ఇతర అబ్బాయిలతో మాట్లాడలేను'' అని వీడియోను మహ్ వశ్ షేర్ చేసింది. దానికి చాహల్ లైక్ చేశాడు. దీంతో ఓ అభిమాని స్పందిస్తూ.. ''యుజీ భాయ్ ఆ మూల నుంచి నవ్వుతున్నాడు'' అంటూ కామెంట్ పెట్టాడు. 'ప్రతిదీ తాత్కాలికమే. చాహల్ ఇచ్చిన లైక్ శాశ్వతం' అంటూ మరొకరు స్పందించారు.

# స్టైలిష్ లుక్స్‌లో అదరగొట్టేసిన తారక్!

మన టాలీవుడ్ మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ఇపుడు చేస్తున్న పలు చిత్రాలు కోసం అందరికీ తెలిసిందే. అలాగే తన లాస్ట్ భారీ హిట్ చిత్రం దేవర జపాన్ లో రిలీజ్ కోసం తారక్ అక్కడికి వెళ్లిన విషయం కూడా తెలిసిందే. మరి అక్కడ ఫుల్ స్వింగ్ లో ప్రమోషన్స్ చేసిన తారక్ తన అభిమానులకి తన లేటెస్ట్ లుక్స్ తో మాత్రం మంచి కిక్ అందిస్తున్నాడు అని చెప్పాలి.

అక్కడకి వెళ్లిన నాటి నుంచి మంచి స్టైలిష్ ఫోటో షూట్స్ చేస్తూ తన నుంచి వస్తున్న ఫోటోలు కొన్ని అభిమానులకి ఆనందాన్ని పంచుతున్నాయి. ఇక ఇలా లేటెస్ట్ గా మరికొన్ని స్టైలిష్ పిక్స్ వైరల్ గా మారాయి. బ్లాక్ నెక్ టీ షర్ట్ మరియు బ్లాక్ పాంట్ లో పైన తెల్లటి డెనిమ్ షర్ట్ లో మంచి డ్యాపర్ గా కూల్ లుక్స్ లో కనిపిస్తూ తారక్ అదరగొట్టేసాడని చెప్పాలి. దీనితో ఈ పిక్స్ నందమూరి అభిమానుల నడుమ వైరల్ గా చక్కర్లు కొడుతున్నాయి. ఇక తారక్ ఇపుడూ వార్ 2, ప్రశాంత్ నీల్ సినిమాల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.



# సెమీస్‌లో జదుమణి

భారత బాక్సర్ జదుమణి మండెంగ్బామ్ (50కేజీ) ప్రపంచకప్ బాక్సింగ్ కప్ లో సెమీఫైనల్ కు దూసుకెళ్లాడు. 20 ఏళ్ల ఈ జాతీయ ఛాంపియన్ క్వార్టర్ ఫైనల్ బౌట్లో 3-2తో బ్రిటన్ కు చెందిన ఎలిస్ ట్రోబ్రిడ్జ్ పై విజయం సాధించాడు. జదుమణి సెమీస్ లో అసిల్బెక్ జలిలోవ్ (ఉస్బెకిస్థాన్)తో తలపడతాడు.

మరో ముగ్గురు భారత బాక్సర్లు నరేందర్ బెర్వాల్ ((90+కేజీ), నిఖిల్ దూబె (75కేజీ), జుగ్నూ (85కేజీ) క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలయ్యారు. నరేందర్ 2-3తో సపార్ బే (ఉజ్బెకిస్థాన్) చేతిలో, నిఖిల్ 0-5తో బెలిని (బ్రెజిల్) చేతిలో ఓడారు. జుగ్నూ 1-4తో అబ్దొలాయె (ఫ్రాన్స్) చేతిలో కంగుతిన్నాడు. ఇంకా మనీష్ రాఠోడ్ (55కేజీ), అభినాష్ (65కేజీ), హితేశ్ (70కేజీ) బరిలోకి దిగాల్సివుంది. ఈ టోర్నీ కోసం భారత్ 10 మందితో కూడిన జట్టును పంపింది. తొలి రోజు లక్ష్య చాహర్ (80కేజీ) తొలి రౌండ్లో ఓడిపోయాడు.



# హైకోర్టును ఆశ్రయించిన హన్సిక

తనపై నమోదైన గృహ హింస కేసును కొట్టివేయాలంటూ నటి హన్సిక బాంబే హైకోర్టును ఆశ్రయించారు. క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సోదరుడి భార్య ఫిర్యాదుతో హన్సికతో సహా ఆమె తల్లిపై గతంలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. జస్టిస్ సారంగ్ కోత్వాల్, జస్టిస్ ఎస్.ఎం. మోదక్ లతో కూడిన ధర్మాసనం హన్సిక సోదరుడి భార్యకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేసింది. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ.. టీవీ నటి ముస్కాన్ జేమ్స్ ను 2020లో వివాహం చేసుకున్నారు. కొన్ని కారణాల వల్ల 2022లో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో హన్సిక సహా సోదరుడు ప్రశాంత్, తల్లి జ్యోతిలపై ముస్కాన్ గృహ హింస చట్టం కింద ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ క్రమంలో 2025 ఫిబ్రవరిలో హన్సిక, జ్యోతిలకు ముంబయి సెషన్స్ కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తమపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హన్సిక, ఆమె తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించారు.





# జీవితమంతా పని చేయాలని అనుకుంటున్నా: కరీనా

వయసు అనేది ఒక సంఖ్య మాత్రమేనన్నారు బాలీవుడ్ నటి కరీనాకపూర్. జీవితమంతా పని చేయాలనుందన్నారు. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నటనను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం గురించి మాట్లాడారు. ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటేనే చిత్ర పరిశ్రమలో అవకాశాలు వస్తాయని చెప్పారు.

''నా దృష్టిలో వయసు ఓ సంఖ్య మాత్రమే. వృద్ధాప్యం వల్ల ఎదురయ్యే ఏ సమస్యనైనా ఎదుర్కోవడానికి నేను ఫిట్ గా ఉండాలనుకుంటున్నాను. 75 ఏళ్ల వయసులో సెట్స్ కు వెళ్లాల్సి వచ్చినా ఆలోచించకుండా వెళ్లగలగాలి. నా మనవరాళ్లను ఎత్తుకోవడానికి వంగ గలగాలి. నా జీవితమంతా పని చేయాలి. అందంగా ఉండడానికి ట్రీట్ మెంట్లు తీసుకొనే బదులు ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే సరిపోతుంది. ఇష్టమైన ఆహారం తీసుకోవడంలో వెనకడుగు వేయను. నా టీనేజ్ లో అసలు డైట్ పాటించలేదు. ఇప్పటికీ మూడు రోజులకు మించి కిచిడి తినకుండా ఉండలేను. దానికి తగినట్లు వ్యాయామం చేస్తాను. ప్రతి స్త్రీ తన జీవితాన్ని తనకు నచ్చినట్లు జీవించాలి. ఆత్మవిశ్వాసంతో ఉండాలి. భరోసాతో ముందుకుసాగాలి. మనపై మనకు నమ్మకం ఉంటేనే ఇతరులకు మార్గదర్శకంగా ఉంటాం'' అని చెప్పారు. ఇక సినిమాల విషయానికొస్తే కరీనా నటించిన 'ది బకింగ్ హామ్ మర్డర్స్' నెట్ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో ఆమె డిటెక్టివ్ గా కనిపించారు. హన్సల్ మెహతా దర్శకత్వంలో క్రైమ్ థ్రిల్లర్ గా ఇది రూపొందింది. బీఎఫ్ఐ లండన్ ఫిల్మ్ ఫెస్టివల్ లోనూ దీన్ని ప్రదర్శించారు.

# రిలీజ్ డేట్ లాక్ చేసుకున్న 'అర్జున్ S/O వైజయంతి'



నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'అర్జున్ ఖీ/ వైజయంతి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేస్తుండగా యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్ టైనర్ గా ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు క్రియేట్ చేసింది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న 'అర్జున్ ఖీ/ వైజయంతి' చిత్రాన్ని వేసవి కానుకగా ఏప్రిల్ 18న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. దీంతో ఈ వేసవిలో యాక్షన్ కు ఏమాత్రం కొదువ లేకుండా మరో ఇంట్రెస్టింగ్ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

ఇక ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి హీరో తల్లి పాత్రలో.. మరోసారి పోలీస్ పాత్రలో సాలిడ్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమాలో సాయి మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తోండగా అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.